PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

# ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 172 | విజయవాడ, శనివారం 27 జనవరి 2024 | 6+8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 27 January 2024 | Rs

**దేశాన్ని మత రాజ్యంగా మార్చే కుట్ర**

- రాజ్యాంగ హక్కుల రక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి
- వివక్ష చూపే ప్రజాప్రతినిధులపై సిఎం చర్యలు తీసుకోవాలి
- డివిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు

లోపలి పేజీలో..



**భారీ ఆధిక్యత దిశగా..**

- భారత్ 421/7
- జడేజా, రాహుల్ అర్ధసెంచరీలు
- ఇంగ్లండ్‌తో తొలి టెస్టు

లోపలి పేజీలో..

# ఘనంగా గణతంత్ర దినోత్సవం



న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో కవాతు చేస్తున్న సిఆర్‌పిఎఫ్ మహిళా జవాన్లు

- కర్తవ్యపథ్ పై మువ్వన్నెల జెండా రెపరెపలు
- జాతీయ జెండా ఆవిష్కరించిన రాష్ట్రపతి
- ముఖ్య అతిథిగా ఫ్రెంచ్ అధ్యక్షులు మాక్రాన్
- నారీ శక్తిని చాటేలా సాగిన పరేడ్

5

# ప్రాజెక్టుతో పాటే పునరావాసం

**గణతంత్ర దినోత్సవ సందేశంలో పోలవరంపై గవర్నర్**



2

ఆడుదాం ఆంధ్రా శకటాన్ని తిలకిస్తున్న సిఎం జగన్ దంపతులు



జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న గవర్నర్ నజీర్

**కార్పొరేట్లకు అమ్ముడుపోయిన ప్రభుత్వాలు**

- కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడకపోతే ఉద్యమం
- దేశ సంపదను సంపన్నులకు కట్టబెడుతున్న మోడీ
- రాష్ట్రవ్యాప్తంగా ట్రాక్టర్లు, బైక్ ర్యాలీలు

3

# మాటల్లోనే మహిళా సాధికారత

- ఉపాధి రహితంగా మహిళా గ్రూపులు
- చాలీచాలని అప్పులు
- అవీ కొన్ని సంఘాలకే
- విడతల్లో రుణ మాఫీతో అధిక వడ్డీ భారం
- జీరో ఇంట్రెస్ట్ పెద్ద మాయ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

పేద అక్క చెల్లెమ్మల ఆర్థిక సాధికారత లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళా స్వయం సహాయక సంఘాలు (ఎస్‌హెచ్‌జి) భ్రాంతిలో కాలం వెళ్లదీస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలతో రుణ మాఫీ, సున్నా వడ్డీ కొందరికే దక్కుతున్నాయి. మహిళలకు విరివిగా బ్యాంక్ లింకేజి రుణాలిప్పించి లక్షాధికారులను చేస్తామనగా ఆ ఛాయలు దుర్భిణీ వేసి చూసినా కనిపించట్లేదు. ఆర్థిక వెసులుబాటు కల్పించి స్వశక్తిపై ఆధారపడేలా స్త్రీలను తీర్చిదిద్దుతామని, వ్యాపారవేత్తలుగా తయారు చేస్తామన్న హామీలు అధికారంలోకొచ్చి నాలుగున్నరేళ్లయినా ఒక్క అడుగు ముందుకు పడలేదు. ప్రస్తుతం సెల్ఫ్ హెల్ప్ గ్రూపు మహిళలను ప్రభుత్వ కార్యక్రమాల బలవంతపు ప్రేక్షకులుగా మార్చివేశారు. కుటుంబ అవసరాలకు తగ్గట్టు అదనుకు బ్యాంకుల నుంచి రుణాలందక, వడ్డీ మాఫీ కాక, ఉపాధి లేక నారీ లోకం నానా అవస్థలూ పడుతోంది.

**సగటున రూ.8 వేలే**

ఎన్నికలనాటికి బ్యాంకుల్లో సంఘాల పేరిట ఉన్న రుణాలను నాలుగు విడతల్లో మాఫీ చేస్తామని వైసిపి హామీ ఇచ్చింది. రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమితి (ఎస్‌-ఎల్‌బిసి) లెక్కల ప్రకారం 2019 మార్చి నాటికి అన్ని బ్యాంకుల్లో కలిపి 7.98 లక్షల గ్రూపుల్లోని 78 లక్షల పైచిలుకు సభ్యులకు రూ.25,571 కోట్ల రుణాలున్నట్లు తేల్చి, ఏడాదికి సుమారు రూ.6,394 కోట్ల చొప్పున నాలుగు తడవల్లో మాఫీ చేశారు. ఒక్కో సభ్యురాలికి సగటున మాఫీ అయింది రూ.8 వేలు. కానీ బ్యాంకుల్లో అవుట్ స్టాండింగ్‌పై అదనపు వడ్డీ పడుతూనే ఉంటుంది.

అందుకే బ్యాంకులు ముందే మహిళల నుంచి పూర్తి స్థాయి వడ్డీ, అపరాధ వడ్డీలతో సహా లాగేశాయి. ప్రభుత్వం ఇచ్చేది మహిళల వ్యక్తిగత ఖాతాలకే. ఒకేసారి కాకుండా విడతల వారీగా రుణ మాఫీ ఇవ్వడం వలన మహిళలు అధిక వడ్డీ భారం మోయాల్సి వచ్చింది. లాభం గూబల్లోకి వచ్చినట్లయింది. మాఫీ అన్ని గ్రూపులకూ రాలేదు. నిబంధనల వలన వేలాది గ్రూపులు మాఫీ కోల్పోయాయి.

**సున్నా వడ్డీ ఫార్స్**

బ్యాంకులు ఎస్‌హెచ్‌జిల రుణాలపై కేటగిరీల వారీగా వడ్డీ వసూలు చేస్తున్నాయి. రూ.మూడు లక్షల వరకు 7 శాతం, 3 నుంచి 5 లక్షల వరకు 10 శాతం, ఆ పైన పది లక్షల వరకు 13 శాతం దాకా వడ్డీ వేస్తున్నాయి. వెనుకబడ్డ జిల్లాల్లో గ్రూపు రుణాలు నిర్ణీత గడువులోపు రీపేమెంట్ చేస్తే కేంద్రం మూడు శాతం రాయితీ ఇస్తోంది. మన రాష్ట్రంలో వెనుకబడ్డ జిల్లాలుగా ఏడు (ఉమ్మడి జిల్లాలు) విభజన సమయంలో పేర్కొన్నారు. ఆ జిల్లాల్లో గ్రూపులకు ఎక్కడా కేంద్రం నుంచి 3 శాతం వడ్డీ రాయితీ వచ్చిన దాఖలాల్లేవు. రాష్ట్ర ప్రభుత్వం సున్నా వడ్డీకి రుణాలంది. కానీ వడ్డీని ఎప్పటికో రీయింబర్స్ చేస్తోంది. దాంతో వడ్డీని, అసలును నెలవారీ వాయిదాల రూపంలో బ్యాంకులకు మహిళలు చెల్లిస్తున్నారు. గడువు లోపు చెల్లించాలన్న నిబంధన వలన పలు గ్రూపులకు వడ్డీ రాయితీ రావట్లేదు. ఉదాహరణకు 2022-23లో మిగతా 2లో



**మారణకాండను ఆపండి**

- తీసుకున్న చర్యలపై నెలరోజుల్లో నివేదిక ఇవ్వండి
- ఇజ్రాయిల్‌ను ఆదేశించిన అంతర్జాతీయ న్యాయస్థానం
- దక్షిణాఫ్రికా పిటిషన్‌పై తీర్పు

5

## నర్సరావుపేట లోక్‌సభ బరిలో అనిల్!

- బిసి కార్డుతో విజయం కోసం వైసిపి వ్యూహం
- గుంటూరులో ఉమ్మారెడ్డి కుమారుడి పేరు పరిశీలన?



ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

నర్సరావుపేట లోక్‌సభకు నెల్లూరు ఎమ్మెల్యే అనిల్ కుమార్‌ను వైసిపి తరుపున పోటీ చేయించాలని సిఎం జగన్ నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం అనిల్‌కుమార్‌ను తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయానికి పిలిపించి ఈ విషయం చెప్పారు. ఆలోచించుకుని చెబుతానని అనిల్‌కుమార్ అనగా... 'లేదు తప్పని సరిగా నర్సరావుపేట నుంచి నువ్వు పోటీ చేయాలి. గెలవాలి' అని సిఎం జగన్ చెప్పినట్టు తెలిసింది. సామాజిక సమీకరణల్లో నర్సరావుపేట లోక్‌సభకు బిసి అభ్యర్థిని ఎంపిక చేయాలని సిఎం జగన్ రెండు నెలల క్రితమే నిర్ణయించారు. ఈ మేరకు నర్సరావుపేట సిట్టింగ్ ఎంపి లావు కృష్ణదేవరాయులును గుంటూరు నుంచి పోటీ చేయాలని కోరారు. ఇందుకు ఆయన నిరాకరించి ఎంపి పదవికి, వైసిపికి రాజీనామా చేశారు. దీంతో, ముందుగా నిర్ణయించిన ప్రకారం బిసి నాయకుడు అనిల్‌కుమార్‌ను ఎంపిక చేశారు. పల్నాడు జిల్లాలో బిసిల జనాభా ఎక్కువగా ఉండడం, కొంతమేరకు ఏడు అసెంబ్లీల్లో వైసిపికి పెద్దగా వ్యతిరేకత లేకపోవడం వల్ల బిసి కార్డును ఉపయోగించడం ద్వారా గెలుపు సునాయాసనం అవుతుందని ఐప్యాక్ సర్వే బృందాలు వైసిపి అధిష్టానానికి నివేదించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ అధికార ప్రతినిధిగా ఉన్న నాగార్జున యాదవ్‌ను తొలుత ప్రతిపాదించినా లోక్‌సభ పరిధిలోని ఏడుగురు వైసిపి ఎమ్మెల్యేలు అంతగా సుముఖత చూపలేదు. ఇందుకు ప్రత్యామ్నాయంగా అనిల్‌కుమార్ పేరును తెరపైకి తెచ్చారు. మరోవైపు టిడిపి తరుపున లావు కృష్ణదేవరాయులు పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. దీంతో, ఆయనను ఎదుర్కొనేందుకు దీటైన అభ్యర్థి అవసరం అని వైసిపికి సర్వే బృందాలు తేల్చి చెప్పాయి. ఈ నేపథ్యంలో ఇతర జిల్లాల్లోని బిసి అభ్యర్థుల పేర్లను పరిశీలించారు. చివరికి నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్ వైపు సిఎం జగన్ మొగ్గు చూపారు. నెల్లూరులో ఉన్న గ్రూపు విభేదాల నేపథ్యంలో ఆయనను అక్కడి నుంచి తప్పిస్తే కొన్ని సమస్యలు పరిష్కారం అవుతాయని కూడా అంచనా వేస్తున్నారు. గుంటూరు, నర్సరావుపేట లోక్‌సభ స్థానాలను టిడిపి ఒకే సామాజిక తరగతికి కేటాయిస్తుండడంతో ఇందుకు మిగతా 2లో

## ఆల్ట్ న్యూస్ జుబేర్‌కు మత సామరస్యతా పురస్కారం

- గణతంత్ర దినోత్సవాన అందజేసిన స్టాలిన్

చెన్నై : గణతంత్ర దినోత్సవాల సందర్భంగా ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకులు మహ్మద్ జుబేర్‌కు మత సామరస్యతా పురస్కారాన్ని తమిళనాడు ప్రభుత్వం అందచేసింది. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఈ పురస్కారాన్ని ఆయనకు అందచేశారు. కృష్ణగిరి జిల్లా డంకానికొట్టైకి చెందిన జుబేర్ తన ఆల్ట్ న్యూస్ పోర్టల్ ద్వారా సామాజిక మాధ్యమాల్లో వచ్చే వార్తల్లో వాస్తవికతలను విశ్లేషిస్తూ కథనాలను రాస్తుంటారు. బూటకపు వార్తల వల్ల సమాజంలో తలెత్తే హింస, ఘర్షణలు వంటి వాటిని నివారించేందుకు ఆయన చేసిన కృషి ఎంతగానో దోహదపడిందని అవార్డు కింద అందచేసిన ప్రశంసా పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గతేడాది మార్చిలో జరిగిన ఒక సంఘటనను ఆ పత్రంలో ఉదహరించారు. తమిళనాడులో వలస వచ్చిన కార్మికులపై దాడులు జరుగుతున్నాయంటూ ఒక బూటకపు వార్త సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. అయితే ఆ వీడియో ఫుటేజీ వాస్తవమా కాదా అని పరిశీలించి, నిర్ధారించిన తర్వాత ఆయన తన వెబ్‌సైట్‌లో ఆ సంఘటన జరిగింది తమిళనాడులో కాదని స్పష్టం చేశారు. ఆ రకంగా తమిళనాడులో హింస తలెత్తకుండా చూశారని పేర్కొన్నారు.

# దేశవ్యాప్తంగా కిసాన్ ట్రాక్టర్ పరేడ్

- 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 484 జిల్లాల్లో కవాతు
- కార్పొరేట్ దోపిడీ అంతం, లౌకిక ప్రజాస్వామ్య దేశాన్ని రక్షించాలని ప్రతిజ్ఞ
- మోడీ దేశంలోనే అత్యంత రైతు వ్యతిరేకి



పంజాబ్‌లో ట్రాక్టర్ పరేడ్ ప్రారంభోత్సవానికి మీడియాతో మాట్లాడుతున్న సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) నేతలు, పెద్ద సంఖ్యలో ట్రాక్టర్లతో తరలివచ్చిన రైతులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కార్పొరేట్ దోపిడీని అంతం చేయడానికి, వ్యవసాయాన్ని రక్షించడానికి, దేశాన్ని రక్షించాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇచ్చిన కిసాన్ ట్రాక్టర్, వాహన కవాతు పిలుపు దేశమంతటా భారీ భాగస్వామ్యంతో, ఉత్సాహంతో విజయవంతంగా జరిగింది. ప్రతికూల పరిస్థితుల్లో ముఖ్యంగా ఉత్తర భారతదేశంలో పదివేల ట్రాక్టర్లు, ఇతర వాహనాలు లక్షలాది మంది రైతులతో కవాతులో చేరాయి. 27 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 484 జిల్లాల్లో కవాతు జరిగింది. పంజాబ్, హర్యానా, కేరళ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల్లో టాక్టర్, వాహన కవాతు జరిగింది. ముందుకు వచ్చి దేశ రైతులు, కార్మికుల దేశభక్తితో ఇంత గొప్ప విజయాన్ని అందించిన వారందరికీ ఎస్‌కెఎం అభినందనలు తెలిపింది.

రైతు సంఘాలతోపాటు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాలు కూడా పాల్గొన్నాయి. తద్వారా క్షేత్ర స్థాయిలో రైతు, కార్మిక ఐక్యతను మరింత బలోపేతం చేసింది. విద్యార్థులు, యువత, మహిళలు, ఇతర వర్గాల ప్రజలు సంఘీభావం తెలిపారు. పరేడ్‌లో పాల్గొన్నవారు మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల, రైతు వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని, రిపబ్లిక్ ఆఫ్ ఇండియా లౌకిక, ప్రజాస్వామ్య స్వభావాన్ని బలోపేతం చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తే ప్రజల విస్తృత, బలమైన ప్రతిఘటనను ఎదుర్కొంటుందని మిగతా 5లో

# భవిష్యత్ ఉద్యమాలకు దిక్సూచి

**• ప్రభుత్వం మాటను నిలబెట్టుకోకుంటే మళ్లీ పోరాటం • అంగన్‌వాడీల అభినందన సభలో వక్తలు**





విజయవాడ అభినందన సభలో మాట్లాడుతున్న కె.సుబ్బరావమ్మ

ప్రజాశక్తి- యంత్రాంగం

వీరోచితంగా సాగిన అంగన్‌వాడీల పోరాటం భవిష్యత్తు ఉద్యమాలకు దిక్సూచిగా, స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పలువురు నేతలు పేర్కొన్నారు. ప్రభుత్వం మాటను నిలబెట్టుకోకుంటే మళ్లీ పోరాటం తప్పదని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్బంధాలకు, అరెస్టులకు, బెదిరింపులకు లొంగకుండా 42 రోజులపాటు ఎంతో చారిత్రాత్మకంగా ఉద్యమించి తమ సమస్యలను పరిష్కరించుకున్న అంగన్‌వాడీల అభినందన సభలు విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలోనూ, గుంటూరులోనూ, పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోనూ శుక్రవారం జరిగాయి. ఈ సభల్లో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ ఐక్యతే అంగన్‌వాడీల ఉద్యమానికి బలమన్నారు. వీరి పోరాట విజయం మిగిలిన కార్మికవర్గానికి ఎంతో ఉత్తేజాన్నిస్తుందని పేర్కొన్నారు. ఎస్మాను, నిర్బంధాలను, అక్రమ కేసులను, అరెస్టులను, పోలీసుల దెబ్బలను ఇలా అన్నింటినీ అధిగమించి, ఉద్యమించి విజయం సాధించిన అంగన్‌వాడీలు, వారికి మద్దతునిచ్చిన వారు అభినందనీయులని అన్నారు. నిర్బంధాలను ఎదుర్కొని మొక్కవోని దీక్షతో చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంత మొండిగా వ్యవహరించినా పోరాట పటిమకు తలొగ్గక తప్పలేదన్నారు. చర్చల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వివరించారు. వీటి అమలు కోసం అందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం తన మాటను నిలబెట్టుకోకుంటే మళ్లీ పోరాటమే అంగన్‌వాడీల ఆయుధమవుతుందని అన్నారు. సమ్మెకు సంఘీభావం, మద్దతుగా నిలిచిన సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఐసిడిఎస్ వ్యవస్థ విస్తరణ, పటిష్టత, ప్రభుత్వ హామీల అమలుకు అంగన్‌వాడీలు సిద్ధంగా ఉండాలన్నారు. తోటి కార్మికుల ఉద్యమాల్లోనూ అంగన్‌వాడీలు భాగస్వాములు కావాలని సూచించారు. విజయవాడ సభలో పౌర సంక్షేమ సంఘాల సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్బంధాలను సైతం లెక్కచేయకుండా ఆత్మగౌరవంతో తలెత్తుకొని తిరిగే విధంగా పోరాడి విజయం సాధించి అంగన్‌వాడీలు చరిత్ర సృష్టించారని పేర్కొన్నారు. ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించి రాష్ట్ర వ్యాప్తంగా లక్షమందికిపైగా అంగన్‌వాడీలు అనేక కష్ట, నష్టాలకోర్చి ఒకే మాట-ఒకే బాటలా సాగడం మిగతా 5లో

## 92 మంది మున్సిపల్ కమిషనర్లు బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం భారీగా మున్సిపల్ కమిషనర్లను బదిలీ చేసింది. ఈ మేరకు 92 మంది కమిషనర్లు, అదనపు కమిషనర్లను శుక్రవారం బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఒకేచోట మూడేళ్లు పనిచేసిన వారిని, సొంత జిల్లాలకు కాకుండా ఇతర జిల్లాలకు ప్రభుత్వం బదిలీ చేసింది.

**పల్నాడులో రోడ్డు ప్రమాదం**

- ముగ్గురు కూలీలు దుర్మరణం

3

# రాజోలు, రాజానగరంలో జనసేన

- ప్రకటించిన పవన్‌కల్యాణ్
- టిడిపి పొత్తు ధర్మం మరుస్తుందని విమర్శ
- అయినా కలిసే సాగుతామని వెల్లడి

**అమరావతి బ్యూరో:** రాజోలు, రాజానగరం అసెంబ్లీ స్థానాల నుండి తమ పార్టీ అభ్యర్థులు బరిలోకి దిగుతున్నారని జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకల్లో జాతీయ జెండాను ఎగుర వేసిన అనంతరం పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ ఈ విషయం తెలిపారు. ఇటీవల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన నేపథ్యంలో పవన్ కల్యాణ్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. తన ప్రసంగంలో ఆయన ఈ విషయాన్ని కూడా ప్రస్తావించారు. 'నాకు కూడా కార్యకర్తల నుండి ఒత్తిడి ఉంది. నేను కూడా తట్టుకోలేకపోతున్నాను. అందువల్లే ప్రత్యేక పరిస్థితుల్లో ఈ నిర్ణయం తీసుకున్నాను' అని చెప్పారు. టిడిపి నేతలు పొత్తు ధర్మం మరచి మాట్లాడుతున్నారని, మీరు కూడా మాట్లాడవచ్చుకదా అని కొంతమంది తనతో అన్నారని చెప్పారు. మరికొందరు జనసేన పోటీ చేసే స్థానాల సంఖ్య గురించి కూడా మాట్లాడారని అన్నారు. 'ఎన్ని స్థానాలు తీసుకోవాలో నాకు తెలియదా?' అని ప్రశ్నించారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నవారికి పొత్తులు, సర్దుబాట్లు అంటే కొంత ఇబ్బంది ఉంటుందని చెప్పారు. అయితే ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా రానున్న ఎన్నికల తర్వాత జగన్ ప్రభుత్వం కనబడకూడదన్నారు. ఒక మాట అటు ఇటూ అయిన టిడిపితో పొత్తులోనే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. కేవలం ఎమ్మెల్యే సీట్ల దగ్గర ఆగిపోమని, స్థానిక సంస్థల ఎన్నికల వరకు ఇరుపార్టీలు కలిసి ముందుకు వెళ్తామన్నారు.

**ఎన్నికల వేళ కులగణన ఎందుకు ?**

ఎన్నికల వేళ కుల గణన ఎందుకంటూ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్ ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. వాలంటీర్ల ద్వారా వైసిపి ప్రభుత్వం సేకరిస్తున్న కులగణన, ఇతర వివరాలను ఏ కంపెనీలో భద్రపరుస్తారనే అంశంపై శ్వేత పత్రం విడుదల చేయాలని పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు. కుల గణన ఉద్దేశం మీకు ఎన్నికల ముందే ఎందుకు వచ్చింది? 'బీహార్ ప్రభుత్వం చేసిన కులగణన సుప్రీంకోర్టులో ఉన్న నేపథ్యంలో, ఆ తీర్పును ప్రకటించకముందే మీ స్వీయ ప్రయోజనాలకు ఎందుకు ప్రజాధనాన్ని వృథా చేస్తున్నారు? అని ట్విట్టర్ వేదికగా పలు ప్రశ్నలు సంధించారు.

# ప్రాజెక్టుతో పాటే పునరావాసం

## గణతంత్ర దినోత్సవ సందేశంలో పోలవరంపై గవర్నర్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రాష్ట్రానికి కీలకమైన పోలవరం ప్రాజెక్టు పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ తెలిపారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందిరాగాంధీ స్టేడియంలో శుక్రవారం ఆయన జాతీయ పతాకావిష్కరణ చేశారు. సాయుధ దళాల గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ఆయన రాష్ట్ర ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలను వివరించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటే సహాయ పునరావాస పనులు (ఆర్అండ్ఆర్) కూడా ఒకేసారి పూర్తయ్యేలా చూస్తామని చెప్పారు. కరువు పీడిత రాయలసీమ, ప్రకాశం, వెనుకబడిన జిల్లాల్లో సాగు, తాగు, పారిశ్రామిక అవసరాలకు నీరు అందించేందుకు చేపట్టిన జలయజ్ఞం ప్రాజెక్టులను కూడా పూర్తిచేస్తామని చెప్పారు. వెలిగొండ రెండో టన్నెల్ పూర్తయిందని, 2024 సెప్టెంబరు నాటికి నల్లమల సాగర్లో నీటిని నిల్వ చేసుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు ప్రత్యక్ష, పరోక్ష నగదు బదిలీ పథకాల ద్వారా రూ.4,21,094 కోట్లను అందించామని పేర్కొన్నారు. 7000 మెగావాట్ల సౌర విద్యుదుత్పత్తి కోసం సెకీతో ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. సెక్యులరిజం, సోషలిజం, ప్రజాస్వామ్యం, గణతంత్ర విలువలను ప్రతిబింబిస్తూ నిర్మించిన 206 అడుగులు ఎత్తయిన అంబేద్కర్ విగ్రహం రాజ్యాంగం పట్ల ప్రభుత్వానికి ఉన్న విధేయతకు నిదర్శనమని చెప్పారు. 56 నెలల కాలంలో ప్రతి గ్రామంలోనూ పరిపాలనా సంస్కరణలు తీసుకొచ్చామని వివరించారు. విద్యారంగంలోనూ అనేక మార్పులు తీసుకువస్తున్నట్లు తెలిపారు. ఇంటివద్దకే పాలన పేరుతో విప్లవాత్మక మార్పులు చేశామని, రేషన్ బియ్యం, పింఛన్లు ఇంటివద్దకే తీసుకెళ్లి అందిస్తున్నామని పేర్కొన్నారు. ఫ్యామిలీ డాక్టర్ పేరుతో ప్రతి ఇంటికీ వైద్య సేవలు అందేలా చూస్తున్నామని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష రెండోదశ చేస్తున్నామన్నారు. అన్ని సేవలూ ఇంటివద్దే అందేలా చేయడం ద్వారా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా చేస్తున్నామని వివరించారు. వికేంద్రీకరణ పేరుతో పరిపాలన సంస్కరణలు చేశామని అన్నారు. మైనార్టీల కోసం కళ్యాణమస్తు, షాదీతోఫా వంటి పథకాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చామని చెప్పారు.



రాజ్‌భవన్‌లో 'ఎట్‌హోం' కార్యక్రమంలో పాల్గొన్న సిఎం జగన్ దంపతులు, గవర్నర్ తదితరులు

పగటిపూట వ్యవసాయానికి ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు.. పొదుపు సంఘాల మహిళలకు నాలుగు దశల్లో రుణమాఫీ చేశామన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలు పరిష్కరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనర్‌రెడ్డితో పాటు ఆయన సతీమణి వైఎస్ భారతి, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

**రాజ్‌భవన్‌లో 'ఎట్‌హోం'**
**పాల్గొన్న సిఎం జగన్ దంపతులు హాజరు**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం గవర్నరు జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎట్‌హోం కార్యక్రమానికి సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ దంపతులు, పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు.

**కార్యాలయాల్లో ఎగిరిన జాతీయ జెండాలు**

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. సిఎం క్యాంపు కార్యాలయంలో సిఎం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య, రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, అసెంబ్లీ ప్రాంగణంలో కౌన్సిల్ అధ్యక్షులు కె మోషేన్‌రాజు, శాసనసభాపతి తమ్మినేని సీతారామ్, హైకోర్టులో చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ జాతీయ జెండాలను ఎగురవేశారు.

**ప్రత్యేక ఆకర్షణగా ఎన్నికల సంఘం శకటం**

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్ల భాగస్వామ్యాన్ని పెంచాలనే లక్ష్యంతో 'ఓటుకు సాటి లేదు.. నేన కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో ప్రదర్శింపబడిన రాష్ట్ర ఎన్నికల సంఘం శకటం గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన వేడుకల్లో పలు శాఖలకు చెందిన శకటాలు ప్రదర్శించారు. 2019 తర్వాత 2024 గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎన్నికల విభాగపు శకటానికి చోటు దక్కింది. ఎన్నికల సంఘం శకటంపై (స్వీప్-2024) సిస్టమ్యాటిక్ ఓటర్స్, ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమాలను వివరిస్తూ భారత ఎన్నికల సంఘం లోగో, పోలింగ్ స్టేషన్, ఇవిఎం, రెప్లికాలను ప్రదర్శిస్తూ సాగిన ఎన్నికల విభాగం శకటం ప్రజాస్వామ్య వ్యవస్థలో అవగాహనతో కూడిన ఓటు హక్కు వినియోగం రాష్ట్రాభివృద్ధి గమనాన్ని, ఉజ్వల భవిష్యత్తును నిర్దేశిస్తుందని ప్రజలకు రాష్ట్ర ఎన్నికల సంఘం చాటి చెప్పింది.

తొలి బహుమతి పొందిన శకటం



ద్వితీయ బహుమతి పొందిన శకటం



తృతీయ బహుమతి పొందిన శకటం



**మొదటి మూడు బహుమతులు పొందిన శకటాలివే...**

పాఠశాల విద్యాశాఖ- సమగ్ర శిక్షా రూపొందించిన ఆంధ్రప్రదేశ్ విద్యావిధానం దేశానికే ఆదర్శం శకటానికి మొదటి బహుమతి లభించింది. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం శకటానికి రెండో బహుమతి లభించింది. ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమ వికాసంపై 'ఊరు మారింది.. బతుకు బాగుపడింది.' అంటూ రూపొందించిన శకటానికి మూడో బహుమతి వచ్చింది.

# మ్యానిఫెస్టోలా గణతంత్ర ప్రసంగం

- నాలుగేళ్ల పాలన తరువాత కూడా పోలవరం పూర్తి చేస్తామని ప్రకటన

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా గవర్నర్ ప్రసంగంలో వైసిపి మ్యానిఫెస్టోకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. తాము ఇచ్చిన హామీలు పూర్తి చేశామని చెబుతూనే పోలవరం అంశాన్ని పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. వాస్తవంగా 2021 నాటికే పోలవరం పూర్తి చేసి నీరు పారిస్తామని వైసిపి ప్రభుత్వం ప్రకటించింది. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆగేది లేదని తెలిపింది. అధికారంలోకి వచ్చిన తరువాత ఐదోసారి జరిగిన గణతంత్ర దినోత్సవంలో పోలవరం పూర్తి చేయడానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. అంటే ఎప్పటికి పూర్తి చేస్తారో కూడా చెప్పలేదు. ఈ ప్రసంగంలో పోలవరంతోపాటే ఆర్అండ్ఆర్ కూడా పూర్తి చేస్తామని తెలిపారు. అంటే ప్రాజెక్టు కన్నా ముందు ఆర్అండ్ఆర్ లేదన్నమాట! ముఖ్యంగా ఇప్పటి వరకూ సిఎం చెబుతూ వచ్చిన, ప్రకటించిన అంశాలనే గణతంత్ర దినోత్సవ ప్రసంగంలో పొందుపరిచారు. మినహా ఏమి చేయబోతున్నామనే అంశాలకు మాత్రం ఎక్కడా ప్రాధాన్యత ఇవ్వలేదు. దీంతోపాటు వెనుకబడిన ప్రాంతాలకు నీటి ప్రాజెక్టులు అనే అంశాన్ని కూడా ప్రస్తావించారు. మూడేళ్లలో ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం గవర్నర్ ప్రసంగంలో వెనుకబడిన ప్రాంతాలకు నీటిని అందించడమే ధ్యేయంగా ప్రాజెక్టులు చేపడతామని పేర్కొన్నారు. ఇచ్చిన హామీల విషయంలో ఎన్నికల ముందు ఏమి చెప్పారో అవే అంశాలూ అటూ ఇటుగా ఉన్నాయి తప్ప ఫలానా మేజర్ ప్రాజెక్టు పూర్తి చేశామనే విషయాన్ని ఎక్కడా స్పష్టం చేయలేదు. రాబోయే ఎన్నికలకు మ్యానిఫెస్టోలా గవర్నర్ ప్రసంగాన్ని మార్చేశారు. గత ఐదేళ్లుగా చెబుతున్న అంశాలనే కొత్తగా చెప్పారు. రూ.13 లక్షల కోట్లతో పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నామని చెబుతూనే 133 భారీ పరిశ్రమలు మాత్రమే ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. దీనిపైనా విమర్శలు వ్యక్తమయ్యాయి. పెట్టుబడుల వల్ల 40 లక్షల మందికి ఉపాధి దొరుకుతుందని చెబుతున్న ప్రభుత్వం ఇప్పుడు 133 ప్రాజెక్టుల ద్వారా సుమారు లక్షన్నరమందికి ఉపాధి కల్పించామని తెలిపారు. చిన్నాచితక, స్టార్టప్‌లు పెట్టామని చెబుతున్నా కొన్ని స్టార్టప్‌లు ఎక్కడ ఉన్నాయో ఎవరికీ తెలియదు. ముఖ్యంగా అంబేద్కర్ విగ్రహ ప్రస్తావన చేయడం ద్వారా సామాజిక అంశాలను ముందుకు తీసుకొచ్చారు.

## నేటి నుంచి ఫిబ్రవరి 9లోగా
# కన్వేయన్స్ డీడ్ రిజిస్ట్రేషన్స్

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

నవరత్నాలు- పేదలందరికీ ఇళ్ల పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా దారిద్ర్యరేఖకు దిగువున ఉన్న లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఇంటి స్థలాలకు కన్వేయన్స్ డీడ్ ( బదలాయింపు) పేరుతో "జగనన్న శాశ్వత స్థల హక్కు పథకం" పేరుతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నేటి నుండి రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానుంది. ఫిబ్రవరి 9లోగా ఈ కార్యమాన్ని పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారయంత్రాంగాన్ని ఆదేశించింది. దీనిలో భాగంగా గ్రామ, వార్డు సచివాలయాలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తిస్తూ ప్రభుత్వం జీఓ ఎంఎస్ నెంబర్ 29ని జారీ చేసింది. పంచాయతీ కార్యదర్శులు, గ్రామ, వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా గుర్తించింది. ప్రభుత్వం కన్వేయన్స్‌డీడ్ ( బదలాయింపు) ప్రక్రియ తప్పులు దొర్లకుండా ఎలా చేయాలనే అంశంపై అవగాహన కల్పించేందుకు ఆయా నియోజకవర్గాల సబ్ రిజిస్ట్రార్లు, గ్రామ, వార్డు సెక్రటరీలు, పంచాయతీ సెక్రటరీలు, విఆర్‌ఓలు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చింది.

**మార్గదర్శకాలు ఇవే:**

- కన్వేయన్స్ డీడ్స్ ప్రక్రియను ఎట్టిపరిస్థితుల్లోనూ ఈనెల 27నుంచి ఫిబ్రవరి 9లోగా పూర్తి చేయాలని, జాయింట్ కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, ఆర్‌డిఓ, తహసీల్దార్లు ప్రాధాన్యతా అంశంగా వేగవంతంగా పూర్తి చేయాల్సి ఉంటుంది.
- ఎన్నికల సంఘం తహసీల్దార్ల బదిలీల ప్రక్రియ ప్రారంభించకమునుపే లబ్ధిదారులకు సంబంధించిన డేటా, వివరాలన్నింటికి కలిపి పూర్తి స్థాయి నివేదికను తయారు చేయాలి.
- గ్రామ వార్డు సచివాలయాల పరిధిలోని ఎగ్జిక్యూషన్ బాధ్యతలను విఆర్‌ఓలు నిర్వహించనున్నారు.
- రెవిన్యూ విలేజ్‌ల వారీగా గ్రామ సచివాలయాల పరిధిలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు లే అవుట్లను పరిశీలించాలి.
- లబ్ధిదారుల ఆధార్ నెంబరు, మొబైల్ నెంబరు, బయోమెట్రిక్ తప్పని సరి.
- ప్లాట్లకు సంబంధించి హద్దులను నిర్ధారించాలి.

# దేశాన్ని మత రాజ్యంగా మార్చే కుట్ర

- రాజ్యాంగ హక్కుల రక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి
- వివక్ష చూపే ప్రజా ప్రతినిధులపై జగన్ చర్యలు తీసుకోవాలి
- డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు

**ప్రజాశక్తి - అమరావతి బ్యూరో**

రిపబ్లిక్ డే ప్రసంగంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రజాస్వామ్య విలువలు గురించి కాకుండా ఆధ్యాత్మిక, అయోధ్య రామాలయం గురించి మాట్లాడటమంటేనే దేశాన్ని ఒక మత రాజ్యంగా మార్చేందుకు ప్రయత్నం మొదలైనట్లు స్పష్టమవుతోందని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని దళిత శోషణ్ ముక్తి మంచ్ (డిఎస్ఎంఎం) జాతీయ నాయకులు వి శ్రీనివాసరావు పేర్కొన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం విజయవాడలోని బందరు రోడ్డులో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో భారత రాజ్యాంగ పీఠిక ప్రమాణాన్ని వి శ్రీనివాసరావు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మనువాద ధర్మం పేరుతో దళితులు, బిసిలను కులాల వారీ విభజించి మూడు వేల ఏళ్ల క్రితం నాటి అనాగరిక ఆదిమ సమాజాన్ని దేశమ్మీద రుద్దేందుకు ప్రధాని మోడీ ప్రయత్నం చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు దీన్ని అడ్డుకోవడానికి ముందుకు వస్తారా?



రాజ్యాంగ పీఠికను చదువుతున్న డిఎస్ఎంఎం జాతీయ నాయకులు వి.శ్రీనివాసరావు తదితరులు

లేక సాగనిస్తారా? అని ఆయన ప్రశ్నించారు. మోడీ ఒక వైపు అణగారిన తరగతులను అణగ తొక్కుతూ ఉంటే ఆ పార్టీకే మద్దతిస్తూ, మరొక వైపు దళితులు, మైనార్టీలకు రక్షణ కల్పిస్తున్నామని చెప్పడంలో అర్థం లేదన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగానైనా అంటరానితనాన్ని పాటిస్తున్న ప్రజా ప్రతినిధులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటానని స్పష్టమైన ప్రకటన చేయాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాజ్యాంగాన్ని కాపాడేందుకు, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ అమలుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు వై వెంకటేశ్వరరావు, గిరిజన సంఘం నాయకులు మంతెన సీతారామ్ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మోడీ ప్రభుత్వ హయాంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రశ్నించే గొంతులను అణచివేస్తున్నారని వారు విమర్శించారు. రాజ్యాంగ విలువలను కాపాడుకునేందుకు మరో స్వాతంత్ర్య పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జి నటరాజ్, క్రాంతి, ముస్లిం మైనార్టీ నాయకులు బేగ్, దళిత సంఘాల నాయకులు సూర్యారావు, శ్రీనివాస్, అరుణ, అశోక్‌బాబు, శ్యామ్, రారాజు, ప్రసన్న, రాఘవేంద్ర, సుందరయ్య పాల్గొన్నారు.

## జాతీయ జెండాను ఆవిష్కరించిన చంద్రబాబు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

గణతంత్ర దినోత్సవం సందర్భంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు జాతీయ జెండాను ఉండవల్లిలోని తన నివాసంలో శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం తన భద్రతా సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. దేశ ప్రజలందరికీ 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు అని ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొన్నారు. అంబేద్కర్ వంటి మహనీయుల ఆదర్శాలు, ఆకాంక్షల నుంచి ఊపిరి పోసుకున్న రాజ్యాంగం అమలు ద్వారా మనం సాధించిన సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక పురోగతిని దేశ ప్రజలు సగర్వంగా గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. ఇటువంటి శుభవేళ స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో రాజ్యాంగ పరిరక్షణకు, సమసమాజ నిర్మాణానికి, పేదరిక నిర్మూలనకు పునరంకితమవుదామని కోరారు.

**టిడిపి కార్యాలయంలో..**

టిడిపి కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు అశోక్ బాబు, టిడి జనార్ధన్, వర్ల రామయ్య, షరీఫ్, పీతల సుజాత, గురజాల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని అన్నారు.

## వినియోగదారులకు మెరుగైన సేవలు

- ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలందించేందుకు విద్యుత్ సంస్థలు కృషి చేస్తున్నాయని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ అన్నారు. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలోని విద్యుత్ సౌధలో జాతీయ జెండాను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని చెప్పారు. విశాఖపట్నంలో జరిగిన ఎపి గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్-2023 సందర్భంగా ఇంధన రంగంలో రూ.9.57 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. రూ.52,015 కోట్లు విలువగల ప్రాజెక్టులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. ఇందులో సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్ సిస్టంతో కూడిన 10గిగా వాట్ల ప్రాజెక్టులు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఎపి పునరుత్పాదక ఇంధన ఎగుమతి విధానం-2020, ఎపి పంప్డ్ స్టోరేజ్ పవర్ పాలసీ-2022, ఎపి గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా పాలసీ-2023 వంటి విధానాలను అమలు చేస్తోందని తెలిపారు. విద్యుత్ సంస్థల కార్యాచరణ పురోగతికి చేసిన కృషిని అభినందిస్తూ ట్రాన్స్‌కో మాజీ డైరెక్టరు ఎం గోపాలరావు, జెన్కో మాజీ డైరెక్టర్ విజయకుమార్‌కు విజయానంద్ ఇతర సీనియర్ అధికారులు జీవితకాల సాఫల్య పురస్కారాలతో సత్కరించారు.

## నర్సరావుపేట లోక్‌సభ బరిలో అనిల్!

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రత్యామ్నాయంగా వేర్వేరు బలమైన సామాజిక తరగతులకు అవకాశం కల్పించాలని సిఎం జగన్ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ఇందులో భాగంగా నర్సరావుపేట బిసిలకు, గుంటూరు కాపులకు ఇవ్వాలని యోచిస్తున్నారు. గుంటూరులో ఇంకా అభ్యర్థి ఎంపికపై అన్వేషణ కొనసాగుతోంది. క్రికెటర్ అంబటి రాయుడుకి అవకాశం ఇవ్వాలని నిర్ణయించినా, ఆయన అర్ధాంతరంగా పార్టీ నుంచి నిష్క్రమించడంతో ప్రత్యామ్నాయంగా మరో కాపు అభ్యర్థి కోసం ప్రయత్నిస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం వైసిపి ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కుమారుడు వెంకటరమణను గుంటూరు లోక్‌సభకు ఎంపిక చేయనున్నట్లు తెలిసింది.



రిపబ్లిక్‌డే కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

## పటిష్టమైన రాజ్యాంగంతోనే ప్రజాస్వామ్యం

- రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

బాబా సాహెబ్ అంబేద్కర్ సారథ్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, మేధావులు పటిష్టమైన రాజ్యాంగాన్ని దేశానికి అందించినందునే దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలంగా వుందని రాజ్యసభ సభ్యులు వి విజయసాయిరెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో 75వ రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. కార్యాలయం ముందు జాతీయ జెండాను విజయసాయిరెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల ద్వారానే ప్రభుత్వాలు ఏర్పాటుకావాలనే ప్రాతిపాదికతో రాజ్యాంగాన్ని రచించారని అన్నారు. కాలానుగుణంగా కొన్ని సవరణలు మినహా 75 ఏళ్ల క్రితం రాసిన రాజ్యాంగం ఇప్పటికీ ఆచరణీయంగా వుండటం గొప్ప విషయమని అన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్యాలయ కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**సిఎం క్యాంపు కార్యాలయంలో..**

తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో 75వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాలకొండయ్య జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఎం అదనపు కార్యదర్శి భరత్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

## డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు

### రవాణా కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న
### ఆర్‌టిసి హౌస్‌లో ఘనంగా గణతంత్ర వేడుకలు

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

భవిష్యత్తంతా విద్యుత్ వాహనాలదేనని, ఎపిఎస్ఆర్‌టిసి కూడా డీజిల్ బస్సుల స్థానంలో విద్యుత్ వాహనాలను ప్రవేశపెట్టేందుకు తగిన ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర రవాణాశాఖ కార్యదర్శి, ఎపిపిటిడి ఇన్‌ఛార్జి కమిషనర్ పిఎస్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. ఎపిఎస్ఆర్‌టిసి ప్రధాన కార్యాలయంలో 75వ గణతంత్ర వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పిఎస్ ప్రద్యుమ్న జాతీయ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆర్‌టిసిలో దశలవారీ విద్యుత్ బస్సులను పెంచాలన్నారు. ఎలక్ట్రిక్ బస్సులకు కీలకమైన ఛార్జింగ్ స్టేషన్‌లను విస్తృతంగా ఏర్పాటుచేయాలని అన్నారు.

రోజుకు సగటున 45 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు ఆర్‌టిసి చేరుస్తోందని తెలిపారు. డిజిటల్ పేమెంట్లతో ప్రయాణికులకు మరింత సౌలభ్యం పెరిగిందన్నారు. ఆర్‌టిసి ఉద్యోగులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారే క్రమంలో కొన్ని సమస్యలు వున్నాయని, వాటన్నిటినీ పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు కెఎస్ బ్రహ్మానందరెడ్డి, కోటేశ్వరరావు, కృష్ణా రీజియన్ డిపిటిఒ ఎంవై దానం తదితరులు పాల్గొన్నారు.

**24 మంది ఉద్యోగులకు ప్రత్యేక ప్రశంసలు**

ఆర్‌టిసిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 24 మంది ఉద్యోగులకు ఆర్‌టిసి యజమాన్యం ప్రత్యేకంగా నగదు ప్రోత్సాహక బహుమతులతో ప్రశంసించింది. ఆపరేషన్స్ విభాగంలో కె మాధవ త్రినాథ్, పి శివాజి, సిహెచ్‌కెఎస్ మార్గరేట్, మెకానికల్ విభాగంలో టి చంద్రశేఖర్, వై నాగశేషు, వి జగదీష్, పివివి ప్రసాద్, కె సుధాకర్, ఎం రోహిత్, జి విజయారత్నం, జెవిఎ ప్రసాద్, జెజెవి నాగభూషణరావు, ఎంఎస్ఆర్ కృష్ణ, అకౌంట్స్ విభాగంలో డి రీనా, పి శ్రీనివాసరావు, పర్సనల్ విభాగంలో వైవి హరికిశోర్, ఎంకె శ్రీనివాస్, ఎస్ పద్మావతి, జి శ్రీనివాసరావు, సివిల్ విభాగంలో ఎన్ఎస్ఎస్‌వి శర్మ, ఎస్ చంద్రశేఖర్, జె మాధవిలత, కె సురేంద్ర, మెడికల్ విభాగంలో డాక్టర్ కె అమృతవల్లికి ప్రత్యేక ప్రశంసా పత్రాలతోపాటు నగదు ప్రోత్సాహకాలను రవాణాశాఖ కార్యదర్శి పిఎస్ ప్రద్యుమ్న అందించారు.

# మూడు పార్టీలూ బిజెపికి బానిసలు

- సిఎం దర్శనం కోసం ఎమ్మెల్యేల పడిగాపులు : షర్మిల

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి, విజయవాడ అర్బన్**

దేశాన్ని మతాల వారీగా విభజించాలని చూస్తోన్న బిజెపికి రాష్ట్రంలోని మూడు పార్టీల అధినేతలూ బానిసలుగా మారారని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల ఆరోపించారు. కృష్ణా జిల్లా, ఉమ్మడి గుంటూరు జిల్లా కాంగ్రెస్ కార్యకర్తలతో శుక్రవారం ఆమె సమావేశమయ్యారు. షర్మిల మాట్లాడుతూ.. బిజెపిలో బి అంటే బాబు, జె అంటే జగన్, పి అంటే పవన్ అని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క ఓటు, సీటు లేకున్నా 25 మంది ఎంపిలు, 175 మంది ఎమ్మెల్యే స్థానాలు గెలిచినట్లు బిజెపి వ్యవహరిస్తోందన్నారు. సిఎం జగన్ దర్శనం కోసం వైసిపి ఎమ్మెల్యేలు పడిగాపులు గాసి విసిగిపోతున్నారని చెప్పారు. రాజశేఖర్ రెడ్డి సిఎంగా అన్ని పార్టీల ఎమ్మెల్యేలకూ తనను కలిసేందుకు అవకాశం ఇచ్చేవారని, నిత్యం ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతుల స్వీకరించేవారని గుర్తుచేశారు. ఇప్పుడు పెద్ద కోటలు కట్టుకుని ప్రజలను, ప్రజాప్రతినిధులను సైతం జగన్ కలవడంలేదన్నారు. జలయజ్ఞంపై వైఎస్ఆర్ ఎంతో దృష్టి పెట్టారని, బడ్జెట్‌లో దాదాపు 15 శాతం నిధులు కేటాయించారని తెలిపారు. అందుకే ఆనాడు ప్రాజెక్టులు నిజ రూపం దాల్చాయన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల లక్షల మంది మైనార్టీలు, దళితులు, గిరిజనులు, బిసిలు విద్యా, ఉద్యోగ అవకాశాలు పొంది నేడు లక్షలు సంపాదించుకుంటున్నారని అన్నారు. విభజన తరువాత గత పదేళ్లలో రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయి చదువు, ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు తరలి వెళ్తున్నారని తెలిపారు. ఎన్నికలకు నెల రోజుల ముందు డిఎస్‌సి నోటిఫికేషన్ ఇస్తే ఉద్యోగాలు ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు రఘువీరారెడ్డి, పల్లంరాజు, కొప్పులరాజు, మస్తాన్‌వలి, సుంకర పద్మజ తదితరలు పాల్గొన్నారు. అంతకుముందు విజయవాడ ఎపిసిసి కార్యాలయంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించండి : లోకేష్

**ప్రజాశక్తి-అమరావతి బ్యూరో**

లక్షలాది పేదల ప్రాణాలతో కూడుకున్న ఆరోగ్య సేవల విషయంలో మొండి వైఖరి విడనాడి సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిడిపి ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విజ్ఞప్తి చేశారు. అస్తవ్యస్త పాలనతో ఖజానా ఖాళీ చేసిన జగన్.. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు దాదాపు రూ.1,200 కోట్లు బకాయిలు పెట్టడంతో రాష్ట్ర వ్యాప్తంగా సేవలు నిలిచిపోయాయని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బకాయిలు విడుదల చేసి సమస్యను పరిష్కరించడంలో చొరవచూపని ప్రభుత్వం ఆస్పత్రులను డీలిస్టు చేస్తూ బెదిరింపులకు దిగడం దారుణమన్నారు.

**పారిపోయేందుకు జగన్ సిద్ధం : అచ్చెన్న**

ఎన్నికలయ్యాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారిపోయేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకుంటూ.. మరోవైపు సిద్ధం పేరుతో ప్రచార సభలు నిర్వహించటం హాస్యాస్పదమని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు అన్నారు. జగన్ తన ప్రచార సభలకు సిద్ధం పేరుకు బదులు పారిపోదాం అని పేరు మార్చుకోవాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ దేనికి సిద్ధమని, చివరి రోజుల్లో మరింత దోచుకోవడానికా? ప్రజాగ్రహం చవిచూడటానికా? ఎన్నికల్లో ఓడిపోవడానికా? ఓటమి అనంతరం దేశం విడిచి పారిపోవడానికా? అని ప్రశ్నించారు.

**షర్మిల మాటలతో చంద్రబాబుకు ఏం సంబంధం? : నక్కా**

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల మాటలకు చంద్రబాబుకు సంబంధం ఏమిటని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు ప్రశ్నించారు. చంద్రబాబే జగన్ పైకి ప్రయోగించారని సజ్జల రామకృష్ణారెడ్డి, వైసిపి నేతలు చెప్పడం తగదన్నారు. టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగన్‌కు, తన చెల్లి, తల్లికి మధ్య ఉన్న విభేదాలకు చంద్రబాబుకు సంబంధం ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి-జనసేన పొత్తు, సీట్ల సర్దుబాటుపై వైసిపికి బాధ ఏమిటని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు ప్రశ్నించారు. ముందు అనుకున్న సీట్లనే పవన్‌కల్యాణ్ ప్రకటించారని, వాటిపై తమకు ఎలాంటి అభ్యంతరం, బాధ లేవని అన్నారు. తమ పొత్తులో ఎలాంటి కల్మషాలు, అభిప్రాయ భేదాలకు తావులేదన్నారు.

# మాటల్లోనే మహిళా సాధికారత

**(మొదటిపేజీ తరువాయి)**

ఆరు లక్షల రూరల్, అర్బన్ గ్రూపులకు బ్యాంకులు రూ.38 వేల కోట్ల రుణాలిచ్చాయంటున్నారు. వాటన్నింటికీ ప్రభుత్వం వడ్డీ మాఫీ చేయాలంటే రూ.4 వేల కోట్లవుతుందని అంచనా. కానీ ప్రభుత్వం మాఫీ చేసింది రూ.1,300 కోట్లే. 2023-24లో రూ.35 వేల కోట్లివ్వాలని టార్గెట్ పెట్టుకున్నారు. ప్రభుత్వం రూ.25 వేల కోట్ల రుణ మాఫీ చేశామనగా బ్యాంకుల్లో గ్రూపు రుణాల ఔట్ స్టాండింగ్ రూ.53 వేల కోట్లు.

**పొదుపు సొమ్ముపై వడ్డీ లేదు**

మహిళలు రూపాయి రూపాయి కూడేసి దాచుకునే పొదుపు సొమ్ము రూ.18 వేల కోట్లకుపైమాటేనని నాబార్డు నివేదికలు వెల్లడిస్తున్నాయి. దానిపై గ్రూపు సభ్యులకు ఒక్క రూపాయి కూడా వడ్డీ ఇవ్వరు. ఏడాదికి ప్రభుత్వానికి పొదుపు సొమ్ముపై రూ.3 వేల కోట్ల వడ్డీ వస్తుంటే, మహిళలకు చేసే వడ్డీ మాఫీ రూ.1,300 కోట్లు. అంటే మహిళలే ఎదురు ప్రభుత్వానికి వందల కోట్లిస్తున్నారు. మహిళలు తాము దాచుకున్న పొదుపు డబ్బు ముట్టుకోకూడదు.

ఎక్కడేకాని ఒత్తిడి చేసిన చోట సభ్యుల మధ్య అంతర్గత రుణాలకు అనుమతిస్తున్నారు. శ్రీనిధి రుణాలు వేల కోట్లు ఇస్తున్నామని చెపుతున్నా అవన్నీ రాజకీయ పలుకుబడి, నోరు గల పెత్తందార్లకే పోతున్నాయి. బినామీ సంఘాలకు చేరుతున్నాయి. అవినీతి వ్యవస్థీకృతమైంది. బ్యాంకుల్లో రుణాలు ఒక పట్టాన రావట్లేదు. రిసోర్స్‌పర్సన్స్‌కు, యానిమేటర్ల వంటి సిబ్బందికి, చివరికి రికార్డులు రాయడానికి గ్రూపు సభ్యులు వందల్లో కమీషన్లు ఇచ్చుకోవాల్సి వస్తోంది. సెర్ప్, బ్యాంక్ సిబ్బందికి ముడుపులిచ్చుకుంటేనే కొద్దిపాటి రుణాలొస్తున్నాయి. బలవంతపు ఇన్సూరెన్స్‌లు, నానా రకాల ఫీజులు, ప్రాసెసింగ్ ఛార్జీలు సరేసరి. జగనన్న మార్టులు పెట్టిన చోట గ్రూపు సభ్యులతో షేర్ కాపిటల్‌ను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

మార్టులలో తాము నిర్దేశించిన కార్పొరేట్ కంపెనీల వస్తువులే కొనాలని హుకుం జారీ చేస్తున్నారు. కాగా బోలెడు కష్టాలు పడి తీసుకునే రుణాలు మహిళల స్వయం ఉపాధికి ఏమూలకూ సరిపోవట్లేదు. రోజువారీ కుటుంబ ఖర్చులకే పోతున్నాయి. చివరికి మహిళలు వారి దైనందన బతుకులే బతకాల్సి వస్తోంది. జీవితాల్లో మార్పేమీ లేదు. బ్యాంకులకు అప్పు వాయిదాలు చెల్లిస్తూ రుణ గ్రస్తులుగా మారుతున్నారు.



# పల్నాడులో రోడ్డు ప్రమాదం

- ముగ్గురు కూలీలు దుర్మరణం

ప్రజాశక్తి - చిలకలూరిపేట (పల్నాడు జిల్లా)

పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్లలో శుక్రవారం రోడ్డు ప్రమాదం సంభవించింది. ఆటోను ఆర్‌టిసి బస్సు ఢీకొట్టడంతో ముగ్గురు కూలీలు మృతి చెందగా, 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉంది. రూరల్ ఎస్‌ఐ రవికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని వేలూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు శుక్రవారం ఉదయం నాదెండ్ల మండలంలోని అప్పాపురంలో మిర్చి కోతలకు వెళ్తున్నారు. ఆటో లింగంగుంట్ల సమీపంలోకి రాగానే గణపవరం వైపే అద్దంకి నుండి జాతీయ రహదారిపైకి ఒక్కసారిగా వచ్చింది. అదే సమయంలో గుంటూరు నుండి చిలకలూరిపేట వైపు వస్తున్న మాచర్ల డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు వేగంగా ఆటోను ఢీ కొట్టింది. ఆటో పైకి బస్సు ఎక్కడంతో ఆటో నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంలో యకసిరి హనుమాయమ్మ (62) మహిళ స్థలంలోనే మృతి చెందారు. స్థానికులు క్షతగాత్రులను 108 అంబులెన్సులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గన్నవరపు శివపార్వతి (59), షేక్ హజరత్‌వలి (67) మృతి చెందారు. మరో 15 మంది క్షతగాత్రుల్లో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు జిజిహెచ్‌కు తరలించారు. క్షతగాత్రుల్లో ఆటో డ్రైవర్ షేక్ సుభాని, పాలెపు రజిని, నరుసుల కోటేశ్వరమ్మ, షేక్ ఒలిమా, బేతంచెర్ల మల్లేశ్వరి, పాలెపు శారద, షేక్ జానీబీ, షేక్ ఖాదర్‌బీ, షేక్ మహబూబ్‌బీ, షేక్ మస్తాన్‌బీ, షేక్ సుభాని, గోరంట్ల శివకుమారి ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆస్పత్రిలో క్షతగాత్రులను మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

# జర్నలిస్టు ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయండి

- ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని అక్రిడేటెడ్ జర్నలిస్టులకు సంబంధించి ప్రభుత్వం ఇస్తామన్న మూడు సెంట్ల ఇళ్ల స్థలాల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకట్రావ్, జి ఆంజనేయులు, ఎపిబిజెఎ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి శ్రీనివాసరావు, కోశాధికారి కె మునిరాజులు సంయుక్తంగా శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలిచ్చే ప్రక్రియను ప్రారంభించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కొన్ని జిల్లాల్లో ప్రక్రియ మొదలైనా మరికొన్ని జిల్లాల్లో ఇప్పటి వరకూ ఇళ్లస్థలాల కమిటీ సమావేశాలు కూడా జరగలేదని తెలిపారు. త్వరలో ఎన్నికల షెడ్యూల్ వెలువడుతుందనే వార్తలతో జర్నలిస్టుల్లో ఆందోళన పెరగిపోయిందని పేర్కొన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం మూడు సెంట్ల ఇళ్ల స్థలాల ప్రక్రియను పూర్తి చేయాలని, ఈ మేరకు జిల్లా కలెక్టర్లను ఆదేశించాలని వారు కోరారు.



కర్నూలు రాజ్‌విహార్ సెంటర్ నుంచి ప్రారంభమైన ట్రాక్టర్ ర్యాలీ



విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు, కార్మిక సంఘాల నేతలు, కార్యకర్తలు

# కార్పొరేట్లకు అమ్ముడుపోయిన ప్రభుత్వాలు

- కార్మిక వ్యతిరేక విధానాలు విడనాడకపోతే ఉద్యమం
- దేశ, ప్రజల సంపదను సంపన్నులకు కట్టబెడుతున్న మోడీ
- రాష్ట్రవ్యాప్తంగా ట్రాక్టర్లు, బైక్ ర్యాలీలు

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులకు అమ్ముడుపోయి కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని, ఈ విధానాలను విడనాడకపోతే ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని పలువురు వక్తలు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలలో బిజెపిని ఓడించడం ద్వారా మాత్రమే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోగలమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రిపబ్లిక్ దినోత్సవం రోజున సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ట్రాక్టర్, బైక్ ర్యాలీలు నిర్వహించారు. మద్దతు ధరల, రైతు విమోచన చట్టం తేవాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించొద్దని, నాలుగు కార్మిక కోడ్లను రద్దు చేయాలని, భూ యాజమాన్య హక్కు చట్టం-2022ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు.

విజయవాడలోని మీసాల రాజారావు వంతెన నుంచి పడవల రేవు వరకు బైకులు, ఆటోలతో ర్యాలీ నిర్వహించారు. సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి శోభనాధీశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరావు, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.కేశవరావు, పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ బాబూరావు, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి యం.హరిబాబు, ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోలారి, భారత్ బచావో రాష్ట్ర అధ్యక్షుడు సిహెచ్ భాస్కరరావు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు. మనువాదం నుండి భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామన్నారు. కేంద్రం అనుసరిస్తోన్న రైతాంగ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాల వల్ల భారత ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని తెలిపా రు. రాముడిని రాజకీయాల్లోకి లాగి మరలా ఎన్నికల్లో గెలిచేందుకు కేంద్రం చూస్తోందని విమర్శించారు.

పల్నాడు జిల్లా నరసరావుపేటలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య మాట్లాడుతూ.. ఢిల్లీలో రైతు ఉద్యమం నాటి హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరించిందని, వ్యవసాయ కార్పొరేటీకరణకు కుట్రలు కొనసాగుతున్న నేపథ్యంలో రైతులు మరింత సంఘటితంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని కోరారు. గుంటూరులో బిఆర్ స్టేడియం నుంచి చుట్టుగుంట సెంటర్ వరకూ ద్విచక్ర వాహన ప్రదర్శన చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు. తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని కుంచనపల్లిలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు. పెట్రోల్ డీజిల్, గ్యాస్, ధరలను విపరీతంగా పెంచేసి, ప్రజల నెత్తిన భారాలు వేయడమే కాక, వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నిందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి శివనాగరాణి, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పిల్లలమర్రి బాలకృష్ణ తదితరు లు పాల్గొన్నారు. కర్నూలులో కొత్త బస్టాండు నుంచి రాజ్ విహార్ కూడలి మీదుగా కలెక్టరేట్ వరకూ ట్రాక్టర్లు, ఆటోలు, బైక్ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ శవపేటికను తయారు చేసి ఊరేగించారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.రామచంద్రయ్య పాల్గొని మాట్లాడారు. రైతు కార్మిక వ్యతిరేక మోడీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలని, రైతులు ఏడాదికిపైగా ఆందోళనలు చేసిన సందర్భంగా మోడీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గిట్టుబాటు, మద్దతు ధర చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఒంగోలులో బైక్, ట్రాక్టర్ ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు, ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు గుజ్జుల ఈశ్వరయ్య, పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో నెలకొన్న సంక్షోభాలను తొలగించేందుకు, రైతులను ఆదుకునేందుకు డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు పెట్టుబడిపై అదనంగా 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నాయకులు వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదారి జిల్లా భీమవరంలో వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. వందేళ్ల నుంచి సాధించుకున్న హక్కులను మోడీ ప్రభుత్వం పదేళ్లలో అణగదొక్కడానికి ప్రయత్నించిందని, అయితే రైతులు, కార్మికులు అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారు. మోడీ అధికారంలోకి వచ్చాక దేశ, ప్రజల సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రారంభమైన ట్రాక్టర్ల ర్యాలీ జ్యూట్‌మిల్లు, ఓవర్‌బ్రిడ్జి మీదుగా ఫైర్ స్టేషన్ సెంటర్ గుండా జిల్లా పరిషత్ కార్యాలయం వరకు సాగింది.

విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి జడ్జి కోర్టు మీదుగా ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా తిరిగి జివిఎంసి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు ప్రారంభించి, మాట్లాడారు. 2024 ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని, దానికి మద్దతు ఇస్తున్న వారిని ఓడించడం ద్వారా మాత్రమే భారత రాజ్యాంగాన్ని కాపాడుకోగలమన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతోందని విమర్శించారు. అనకాపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ పీఠికను చదివి ప్రతిజ్ఞ చేశారు.

బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం, తూర్పుగోదావరి జిల్లా చాగల్లులో నిరసనలు జరిగాయి. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు పాల్గొన్నారు. నెల్లూరు, నంద్యాల, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా, ఉమ్మడి కడప జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్, బైక్ ర్యాలీలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు.

# వైసిపి పాలనలో కానరాని రాజ్యాంగ స్ఫూర్తి : పురందేశ్వరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి పాలనలో రాజ్యాంగ స్ఫూర్తి కనబడటం లేదని, సమసమాజ స్థాపన భావన అనేది లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. విజయవాడలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళమెత్తిన వారందరినీ జైలుకు పంపుతున్నారని, వాక్ స్వాతంత్ర్యం అనేది రాష్ట్రంలో ఎవరికీ లేకుండా పోయిందని అన్నారు.

# 31 నుంచి ఎడ్‌సెట్ అడ్మిషన్ల కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిఇడి ప్రవేశాలకు సంబంధించిన ఎడ్‌సెట్ మొదటి దశ కౌన్సెలింగ్ ఈ నెల 31 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు ఎడ్‌సెట్ అడ్మిషన్ల కన్వీనర్ కె రామ్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిబ్రవరి 6 వరకు కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు 31 నుంచి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వెల్లడించారు.

# నేడు వైసిపి ఎన్నికల శంఖారావం

- 'సిద్ధం' పేరిట విశాఖలో సభ
- సిఎం వైఎస్.జగన్ రాక
- తరలిరానున్న అధికార పార్టీ ఉత్తరాంధ్ర జిల్లాల క్యాడర్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా భీమునిపట్నం నియోజకవర్గం సంగివలస వద్ద 'సిద్ధం' పేరిట వైసిపి ఆధ్వర్యాన శనివారం తలపెట్టిన బహిరంగ సభకు చకచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం జరిగే ఈ సభలో ఉత్తరాంధ్రకు చెందిన 34 అసెంబ్లీ నియోజకవర్గాల కార్యకర్తలు, గృహ సారథులు పాల్గొననున్నారు. నాలుగున్నరేళ్లలో ఎలాంటి అవినీతికీ తావులేకుండా వైసిపి ఆధ్వర్యాన పాలన జరిగిందన్న విషయాన్ని ఈ సభ ద్వారా ఫోకస్ చేయనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనే ఈ సభకు ఎక్కువ మందిని తరలించే దిశగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ప్రజల్లో పనిచేసే పార్టీ శ్రేణుల కదలికే లక్ష్యంగా ఉత్తరాంధ్రకు చెందిన నేతలంతా గడచిన పది రోజులుగా సభ జయప్రదానికి కృషి చేస్తున్నారు. ఉత్తరాంధ్రకు ప్రధాన ముఖద్వారమైన విశాఖ గ్రామీణ ప్రాంతంలో తొలి ఎన్నికల శంఖారావ సభను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నేతలు ఇప్పటికే




ప్రకటించారు. 'సిద్ధం' అనే ట్యాగ్‌లైన్‌తో వైసిపి ఈ సభను నిర్వహిస్తూ కేడర్‌కు ఉత్సాహాన్ని ఇవ్వాలని భావిస్తోంది. సుమారు మూడు లక్షల మంది కార్యకర్తలు, గృహ సారథులు రాక లక్ష్యంగా ఉత్తరాంధ్ర వైసిపి సమన్వయకర్త వైవి.సుబ్బారెడ్డి నేతృత్వంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి ప్రత్యర్థులపై ఇక్కడి నుంచే సిఎం వైఎస్ జగన్ విమర్శనాస్త్రాలు గుప్పించే అవకాశాలు ఉన్నాయని నేతలు చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ వైసిపి గెలుపే లక్ష్యంగా ఈ సభను సంగివలస అనిట్స్ కాలేజీ సమీపంలోని గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నారు. జగన్ ఇక్కడి నుంచే పొలిటికల్ డ్రైవ్ చేస్తారని తెలుస్తోంది. మూడు రాజధానుల్లో విశాఖ - భీమిలి ప్రాంతాన్ని అడ్మినిస్ట్రేషన్ క్యాపిటల్‌గా ఇప్పటికే ప్రకటించడం, ఈ ప్రాంతం నుంచే ఎన్నికల శంఖారావాన్ని పూరించాలనుకోవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో టిడిపి, జనసేన భీమిలి - భోగాపురం మధ్యలో భారీ ఎత్తున బహిరంగ సభ జరిపి పెద్ద సంఖ్యలో జనాన్ని సమీకరించిన నేపథ్యంలో వైసిపి కూడా ఇక్కడే దృష్టిసారించి సభకు సిద్ధమైంది.



తమ్మినేనిని పరామర్శిస్తున్న సిఎం రేవంత్ రెడ్డి

# తమ్మినేనికి రేవంత్‌రెడ్డి పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని ఎఐజి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎఐజి ఆస్పత్రి చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ఇతర వైద్యులని అడిగి మరిన్ని వివరాలు తెలుసుకున్నారు. తమ్మినేని త్వరగా కోలుకోవాలని, ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ సమయంలో పలు రాజకీయ, ఇతర అంశాలు వారి మధ్య చర్చకు వచ్చాయి. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసినప్పుడు ఇచ్చిన విజ్ఞాపన పత్రంలోని సమస్యల పరిష్కారం ఎంత వరకు వచ్చిందని తమ్మినేని ప్రస్తావించారు. వాటిని పరిష్కరిస్తామంటూ సిఎం హామీ ఇచ్చారు. తమ్మినేనిని సందర్శించిన వారిలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సిఎం సిపిఆర్ఓ అయోధ్యరెడ్డి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, ఖమ్మం జిల్లా నాయకులు నవీన్, తమ్మినేని కుమారుడు సంఘమిత్ర ఉన్నారు. గురువారం ఆయనకు మైనర్ ఆపరేషన్ చేసి గుండె వద్ద పేస్ మేకర్‌ను డాక్టర్లు అమర్చారు. ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందనీ, సాధారణ స్థితికి చేరుకుంటున్నారని వారు వివరించారు.

# నవ సమాజ నిర్మాణానికి కవులు కృషి చేయాలి

- ఇన్‌ఛార్జ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎఎండి ఇంతియాజ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

సమాజంలో ఎన్నో రుగ్మతలు ఉన్నాయని, వాటిని కవులు తమ కవితలు, గానం ద్వారా పారద్రోలి నవ సమాజం నిర్మాణానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎపి ఇన్‌ఛార్జ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎఎండి ఇంతియాజ్ అన్నారు. రిపబ్లిక్ డే సందర్భంగా 'భారత రాజ్యాంగం - లౌకిక విలువలు' అనే అంశంపై లౌకిక కవనం పేరుతో కవి గాయక సమ్మేళనం శుక్రవారం విజయవాడలోని ఎంబి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం మనకు సమాన హక్కులు, సమాన అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎక్కడా వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలు ఉండే విధంగా లౌకిక సర్వసత్తాక రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని చెప్పారు. అయితే, అక్కడక్కడా కొన్ని సమస్యలు, రుగ్మతులు ఉన్నాయని.. వాటిని నిర్మూలించి మంచి సమాజం కోసం కృషి చేయాలని కవులకు సూచించారు. ప్రముఖ విమర్శకులు గుంటూరు లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ నేడు సమాజంలో కులం, మతం




మాట్లాడుతున్న ఇంతియాజ్

ప్రధాన సమస్యలుగా ఉన్నాయన్నారు. దేశంలో ఉండాలంటే హిందూ సంప్రదాయాలు, హిందూ దేవుళ్లను గౌరవించాలని నేటి పాలకులు అనధికార శాసనాలను చేస్తున్నారని తెలిపారు. దీంతో ఇతర మతస్తులు కొంత ఆందోళన చెందుతున్నారని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని సంవత్సరాలైనా ఇంకా లౌకిక విలువలు గురించి మాట్లాడుకోవాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. దేశాన్ని సమానత్వం దిశగా పయనింపజేసే దిశలో ప్రోగ్రెసివ్, ప్రగతిశీల, సెక్యులర్ శక్తులు వైఫల్యం చెందాయన్నారు. సాహిత్యం ద్వారా కవులు, రచయితలు కాయకల్ప చికిత్స చేసి పాలకులను మార్చాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి బాధ్యులు వొర ప్రసాద్ అధ్యక్షత వహించగా, ప్రముఖ కవయిత్రి మందరపు హైమావతి, ఎంబివికె విజ్ఞాన కేంద్రం బాధ్యులు బిఆర్.తులసీరావు, నగర ప్రముకులు గోళ్ల నారాయణరావు, కార్యక్రమ నిర్వహణా బాధ్యులు సత్యాజీ, శాంతిశ్రీ, గుండు నారాయణ, సత్యరంజన్, కెంగార మోహన్, తదితరులు పాల్గొన్నారు.

# 'తూర్పు'లో భువనేశ్వరి పర్యటన

ప్రజాశక్తి - సీతానగరం. బిక్కవోలు(తూర్పుగోదావరి)

'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు సతీమణి భువనేశ్వరి శుక్రవారం తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మనస్తాపానికి గురై గుండెపోటుతో మరణించిన రొక్కల రాణి, దాసరి హరిప్రసాద్ కుటుంబాలను ఆమె పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.3 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. బిక్కవోలులో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ చేపట్టిన రిలే దీక్షలో పాల్గొని



రాణి కుటుంబ సభ్యులకు సాయం అందిస్తున్న భువనేశ్వరి

అస్వస్థతకు గురైన కందుకూరి పెద్దసత్తయ్యను పరామర్శించారు. ఆయనకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. బిక్కవోలులో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బొడ్డు వెంకటరమణ తదితరులు ఉన్నారు.

# వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరుకు ప్రాధాన్యం

## గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి

ప్రజాశక్తి - తిరుపతి

సంస్థ పరిధిలోని 11.90 లక్షల మంది రైతులకు పగటిపూట తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేస్తున్నామని, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 78,515 వ్యవసాయ విద్యుత్ సర్వీసులను మంజూరు చేశామని ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్‌పిడిసిఎల్) చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోషరావు తెలిపారు.

సంపాదకీయం

# సుదీర్ఘ ఉద్యమం

అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా కొనసాగించాల్సిందేనంటూ సుదీర్ఘ కాలంపాటు ఉద్యమం నిర్వహిస్తున్నవారందరూ అభినందనీయులు. గురువారం 'అమరావతి రైతుల సమర శంఖారావం' పేరుతో సభ జరపడంతోపాటు రాజధాని గ్రామాల్లో పలు కార్యక్రమాలు చేపట్టారు. తుళ్లూరులో రైతులు, చిన్నారులు 1500 రోజులను సూచించే ప్లకార్డులు పట్టుకొని జై అమరావతి అంటూ నినదించడం అందరి దృష్టినీ ఆకర్షించింది. రాజధాని అమరావతి గ్రామాల ప్రజలు యావత్ కుటుంబ సభ్యులు వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడం స్ఫూర్తిదాయకం. ఏకైక నినాదంతో నాలుగు సంవత్సరాలకు పైబడి సాగుతున్న ఉద్యమం అందులోనూ తీవ్ర నిర్బంధాలకు గురి చేసినా పోలీసులు అవమానించినా వాటన్నిటినీ అధిగమిస్తూ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడం శ్లాఘనీయం. వందల కిలోమీటర్ల పొడవునా సాగిన యాత్రల్లో పాలుపంచుకోవడం అభినందనీయం. మహిళలలో ఓర్పుతో పాటు పట్టుదల మెండుగా ఉంటుందని ఇటీవల వీరోచితంగా సాగిన చారిత్రాత్మక అంగన్‌వాడీల పోరాటం రుజువు చేసింది. ప్రజల సమస్యలపై సకాలంలో స్పందించి వాటి పరిష్కారానికి తగు చర్యలు చేపట్టని ఈనాటి పాలకులను దారికి తేవడానికి సుదీర్ఘ ఉద్యమాలు, పోరాటలు అవసరమవుతున్నాయి. ఢిల్లీ రైతు ఉద్యమం దేశానికిచ్చిన సందేశమిదే! అదే పోరాట శక్తులకు ఆదర్శం.

అవశేష ఆంధ్రప్రదేశ్‌కు అమరావతి రాజధానిగా ఉండాలన్న రాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవ నిర్ణయంలో భాగస్వామిగా ఉండిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారానికి వచ్చాక మాట మార్చి మూడు రాజధానుల పల్లవి లంకించుకోవడం పెద్ద విషాదం. పాలనా రాజధాని పేరిట విశాఖను అభివృద్ధి చేస్తామంటూ భారీ ప్రకటనలు చేసింది కానీ వాస్తవంగా జరిగిందేమీ లేదన్నది నిష్టుర సత్యం. క్యాంపు కార్యాలయాల పేరిట హడావుడి తప్ప ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రజలకు పాలన చేరువయ్యిందేమీ లేదు. ప్రచారార్భాటమే తప్ప ఉత్తరాంధ్ర జిల్లాల్లోని పెండింగ్ ప్రాజెక్టులేవీ పూర్తి కాలేదు సరికదా వాటికి ఖర్చు కూడా లేదు. మాటల్లోనే గిరిజనాభివృద్ధి కావడంతో నేటికీ డోలీ మోతలు తప్పడంలేదు. అయితే రాజధాని, క్యాంపు కార్యాలయాల పేరుతో అక్కడి రియల్ ఎస్టేట్ వ్యాపారులు మాత్రం భారీగా లాభాలు పొందారు. అవసరానికి మించి భారీ భూ సమీకరణ చేపట్టిన టిడిపి సర్కారు గ్రాఫిక్స్‌లో రాజధాని చూపింది కానీ ఆచరణాత్మక నిర్మాణాలు తగు రీతిలో జరగలేదు. నాటి నుండి నేటి వరకూ రాజధాని విషయంలో సిపిఐ(ఎం) ఒక్కటే సూత్రబద్ధమైన వైఖరి చేపట్టడం గమనార్హం. వైసిపి ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట గందరగోళం సృష్టించడంతో అమరావతి అభివృద్ధి ఆగిపోయింది. భూములిచ్చిన రైతులకు అప్పగించాల్సిన అభివృద్ధి చేసిన ప్లాట్లు, ఉపాధి కోల్పోయిన పేదలకు చట్ట ప్రకారం చెల్లించాల్సిన పింఛన్లు ప్రభుత్వం ఇవ్వకపోవడంతో ఉవ్వెత్తున ప్రారంభమైన ప్రజా ఉద్యమం దశలవారీగా సాగింది. ఇందుకు వారు న్యాయపోరాటాన్నీ నిర్వహించారు. రైతులు సర్వోన్నత న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించాల్సి వచ్చింది. ఎన్నో ఆటంకాలను అధిగమిస్తూ ముందడుగు వేస్తూనే ఉన్నారు.

ఢిల్లీని తలదన్నే రాజధాని ఆంధ్ర ప్రదేశ్‌కు నిర్మిస్తామని 2014 ఎన్నికల్లో చెప్పిన నరేంద్ర మోడీ ప్రధాని హోదాలో అమరావతి శంకుస్థాపనకు హాజరై పిడికెడు మట్టి, చెంబుడు నీళ్లు చల్లిపోయారు తప్ప కేంద్ర ప్రభుత్వం చేసిందేమీ లేదు. పైపెచ్చు ఎ.పి కి రాజధాని ఏదో తమకు తెలియదని, నిర్ణయించవలసిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని హైకోర్టులో అఫిడవిట్ వేయడం మరింత దారుణం. రాష్ట్ర పునర్విభజన చట్టం ప్రకారం అమరావతిలో చేపట్టవలసిన కేంద్ర ప్రభుత్వ సంస్థల నిర్మాణం కూడా జరగకపోవడం బిజెపి మోసకారితనానికి నిదర్శనం. కనుక రాజధాని అమరావతికి ఈ దుస్థితి కల్పించినవి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే! పోరాటం వల్లనే అమరావతి ఉద్యమం నిలిచింది. ఆ ఉద్యమం రాజకీయ పోరాటంగా రూపొందితేనే సత్ఫలితాలొస్తాయి. మోసగించినవారిని, గందరగోళం సృష్టించినవారిని, భ్రమలు కల్పించినవారిని ప్రజలు గుర్తించాలి. కీలెరిగి వాత పెట్టడమే మార్గం.

మహనీయుల మాట



దేశమంటే సామాన్యులు.
సామాన్యుల విద్యా వికాసం పైన,
సాంస్కృతిక పునరుజ్జీవనం పైనే
దేశ భవిష్యత్తు ఆధారపడి వుంది.
ప్రజా చైతన్యం ద్వారానే
ప్రజాస్వామ్యం బలపడుతుంది.

**- గ్రుండ్‌విగ్,**
ఫోక్ స్కూల్ రూపకర్త, డెన్మార్క్



# అంగన్‌వాడీల పోరాట ఘనవిజయం



> అంగన్‌వాడీలు గత రెండేళ్ళల్లో హర్యానా, ఢిల్లీ, బీహార్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో మంచి పోరాటాలను నడిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్మా ప్రయోగించినా ఎదిరించి విజయం సాధించేవరకు పోరాడారు. దేశవ్యాప్తంగా జరిగిన అంగన్‌వాడీల సమ్మెలన్నింటిలో ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన ఒప్పందం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌జిఓలకు పిఆర్‌సిలో కోత వేసింది. విద్యుత్ ఉద్యోగులను దగా చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేస్తామన్న మాట తప్పింది. ఇటువంటి పరిస్థితుల్లో అంగన్‌వాడీలు సాధించుకున్న విజయం సాపేక్షంగా మెరుగైనది. అంగన్‌వాడీ పోరాట అనుభవాలను యావత్తు కార్మికవర్గం ఆదర్శంగా తీసుకుందాం.

గడిచిన డిసెంబరు 12 నుండి 42 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీలు చేసిన నిరవధిక సమ్మె పోరాటం చారిత్రాత్మక విజయం సాధించింది. లక్షా 5 వేల మంది అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, మినీ వర్కర్లు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని నడిపారు. దశలవారీగా రోజు రోజుకు పోరాటాన్ని ఉధృతం చేసి రాష్ట్ర బంద్ పిలుపునకు కూడా సిద్ధమయ్యారు. 24 గంటల దీక్షలు చేశారు. నాయకత్వం నిరవధిక దీక్షలకు దిగింది. ఈ విధంగా అన్ని రకాల పోరాటాలను ప్రభుత్వానికి రుచి చూపారు. ఎన్ని రోజులైనా పోరాటం సాగించాలని నిర్ణయించారు. సమస్యలు పరిష్కరించేవరకూ 'తగ్గేదే లేదని' ప్రభుత్వాన్ని పదేపదే హెచ్చరించారు. అంగన్‌వాడీల అకుంఠిత దీక్ష, పట్టుదల ఈ పోరాట విజయానికి కీలకం. పైగా లబ్ధిదారుల, ప్రజల మద్దతు విస్తృతంగా లభించింది. ఇదే కాలంలో రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులు 12 రోజులపాటు సమరశీల పోరాటం నడిపారు. వారి పట్టుదలకు రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి ఒప్పందం చేసింది. అంతేగాక, ఎస్ఎస్ఎ కార్మికులు ఈ కాలంలో జరిపిన సమరశీల పోరాట ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి వారితో ఒప్పందం చేయవలసి వచ్చింది. పోరాటాలే సమస్యల పరిష్కారానికి మార్గమని మరోమారు నిరూపితమైంది.

జనవరి 22 ఒప్పందం జరిగే రోజు వరకూ పోలీసుల జోక్యం లేకుండా జాగ్రత్త పడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేస్తే అంగన్‌వాడీలు మరింతగా తిరగబడతారని ప్రభుత్వానికి తెలుసు. జగనన్నకు కోటి సంతకాలు సమర్పించడాన్ని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్యమం తారాస్థాయికి చేరింది. ప్రభుత్వం దిగి వచ్చింది. అన్ని క్రమశిక్షణా చర్యలూ ఆగిపోయాయి. షోకాజ్‌లు, టెర్మినేషన్లు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. కార్మికులు నూరు శాతం డ్యూటీలో చేరారు. డిమాండ్లు సాధించారు. పోలీస్ కేసులు ఎత్తివేస్తామని కూడా ప్రభుత్వం హామీ ఇచ్చింది. మైలవరంలో పోలీసు కేసుల్లో వున్న అంగన్‌వాడీలతో సహా రాష్ట్రమంతటా అంగన్‌వాడీలు డ్యూటీలో చేరారు. దేశంలో అన్ని రాష్ట్రాల్లో జరిగిన అంగన్‌వాడీల పోరాటాల కంటే ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన విజయం సాధించారని అఖిల భారత అంగన్‌వాడీ నాయకులు ఎ.ఆర్.సింధు కొనియాడారు.



సిహెచ్. నరసింగరావు

అంగన్‌వాడీలు ఎన్ని రోజులు పోరాడతారో చూద్దామని ఆరు సార్లు చర్చలు జరుపుతూ జాప్యం చేసే ఎత్తుగడ చేపట్టింది రాష్ట్ర ప్రభుత్వం. ఎ.పి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఇచ్చిన ప్రతి పిలుపునకు కార్మికులు స్పందించారు. కార్మికుల్లో 90 శాతం బలం వున్న సిఐటియు ఇతర ఎఐటియుసి, ఐఎఫ్‌టియు యూనియన్‌లను ఐక్య కార్యాచరణతో కలుపుకున్నారు. విజయం సాధించేవరకూ ఎన్ని రోజులైనా పోరాడతామని రుజువు చేశారు. ఆదర్శప్రాయమైన ఈ పోరాటాన్ని అభినందించాలి. అంగన్‌వాడీలు ప్రతి రోజూ చార్జీలు పెట్టుకొని మారుమూల గ్రామాల నుండి వచ్చి సమ్మె శిబిరంలో కూర్చొన్నారు. కొంత మంది కార్మికుల ఇళ్ళల్లో భర్తలు కొట్టినా తిరగబడి సమ్మెల్లో పాల్గొన్నారు. ప్రతి ప్రాజెక్టులో తమ సొంత డబ్బులు పెట్టుకొని శిబిరాలు నడుపుకున్నారు. బయట రాజకీయ నాయకులు పోరాటానికి డబ్బులు ఇస్తామన్నా తిరస్కరించారు.

**కార్మికులు ఏం సాధించారు?**

- సమ్మె ప్రారంభించినప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు 'డబ్బులు పెంచం' అని జనవరి 22 వరకూ ఒకే మొండి వైఖరి తీసుకున్నది. పోరాట ఫలితంగా మెరుగైన వేతనాన్ని యూనియన్‌లతో చర్చించి 2024 జులై నుంచి అమలు జరుపుతామని జనవరి 22వ తేదీ రాత్రి జరిగిన చర్చల్లో అంగీకరించడం ఈ పోరాట విజయంలో కీలకం. లక్ష మంది అంగన్‌వాడీలకు జీతాలు పెంచితే మరో 2 లక్షల మంది స్కీమ్ కార్మికులకు పెంచవలసి వస్తుందని ప్రభుత్వ వాదన. వేతనాల పెంపు ఒప్పందంలో అంకెలు కానరావు. కానీ ఈ ఒప్పందం వలన ఏ ప్రభుత్వం అధికారంలో వున్నా యూనియన్లతో తప్పక చర్చించి 2024 జులై నుండి వేతనాలు పెంచాలి.
- సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిటైర్‌మెంట్ అయిన తరువాత వర్కర్‌కు ఇచ్చే గ్రాట్యూటీ తక్షణం రూ. 1.20 లక్షలు (తెలంగాణలో లక్ష), ఆయాకు రూ. 60 వేలు (తెలంగాణలో 50 వేలు) ఇవ్వడానికి ప్రభుత్వం అంగీకరించింది. రాష్ట్ర ప్రభుత్వం గ్రాట్యూటీ చెల్లించడానికి అనుకూలంగా కేంద్ర ప్రభుత్వానికి సిఫార్స్ చేస్తారు. కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో చట్ట ప్రకారం మిగిలిన సుమారు రూ.50 వేలు కూడా పెంచుతామని అంగీకరించారు.
- రాష్ట్రంలో 5,600 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. మినీ అంగన్‌వాడీలను 'మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు'గా మార్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అంగీకరించాయి. ఇది 30 సంవత్సరాల డిమాండ్. జనాభా పెరిగినా మినీ సెంటర్లను ఇప్పటి వరకూ మార్చలేదు. ఇప్పుడు మినీ వర్కర్లుగా వున్న వారందరూ వర్కర్లుగా మారతారు. వారి జీతం నెలకు రూ.7 వేల నుండి నేరుగా రూ.11,500కు పెరుగుతుంది. జులై నుండి పెరిగే జీతం కూడా వారికి అదనంగా వస్తుంది. సుమారు 5 వేల మంది కొత్త వారికి ఆయాలుగా ఉద్యోగాలు వస్తాయి. ఇది మంచి విజయం.
- అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, మినీ వర్కర్లందరికీ రిటైర్‌మెంట్ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలుగా మారుతుంది. అంగన్‌వాడీలందరికీ 2 సంవత్సరాలు అదనంగా పని చేసే హక్కు లభించడంతోపాటు జీతాలు పెరగడంవలన వారి జీవితాలు మెరుగవుతాయి. ప్రభుత్వ ఇతర విభాగాలలో పని చేసే ఉద్యోగులు కూడా రిటైర్‌మెంట్ వయస్సు పెంచాలన్న ఏకైక డిమాండ్‌తో పోరాడుతున్నారు. వారు సాధించలేనిది అంగన్‌వాడీలు పోరాటం వలన సాధించుకున్నారు.
- అంగన్‌వాడీ హెల్పర్ల ప్రమోషన్ వయస్సు 45 నుండి 55 సంవత్సరాలకు పెంచడానికి ప్రభుత్వం జివో ఇచ్చింది. ఇప్పటి వరకూ ఆయాలకు ప్రమోషన్ వయస్సు అడ్డం వచ్చేది. ఇప్పుడు ఆ సమస్యను పరిష్కరించుకున్నారు.
- అంగన్‌వాడీ వర్కర్లు ప్రతి నెలా ప్రాజెక్టు మీటింగ్‌లకు వెళ్ళడానికి అయ్యే ప్రయాణ ఖర్చులు 2017 నుండి ప్రభుత్వాలు ఎగ్గగొట్టాయి. ఇప్పటి నుండి చెల్లించడానికి జివో వచ్చింది. అంతేకాకుండా గతంలో లేనిది ఆయాలకు రెండు నెలలకు ఒకసారి మీటింగ్‌లకు వెళ్ళడానికి రవాణా చార్జీలు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం జివో ఇచ్చింది. పాత బాకీలను చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.
- సర్వీస్‌లో చనిపోయిన అంగన్‌వాడీల కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. సర్వీస్‌లో మరణించిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా అమలు చేస్తారు. చనిపోయిన వారి కుటుంబాలకు దహన (మట్టి) ఖర్చులు రూ. 20,000 సాధించుకున్నారు.
- గ్రేడ్-2 సూపర్‌వైజర్లుకు పరీక్షలు రాసిన వారికి పోస్టులు ఇవ్వడానికి లా సెక్షన్‌లో ఆమోదించారు. త్వరలో వారికి నోటిఫికేషన్ వస్తుంది.
- నాలుగు యాప్‌లు కలిపి ఒక యాప్‌గా మార్చడానికి ప్రభుత్వం అంగీకరించింది. మార్చి నెల నుండి అమల్లోకి తేవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది.
- అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయాలనే డిమాండ్‌పై వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు, మెనూ పెంపు, గ్యాస్ తదితర సమస్యల పరిష్కారానికి కమిటీ వేశారు. కమిటీ సిఫార్సుల మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

సమ్మె కాలపు జీతాలు చెల్లించడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. సమరశీల పోరాటాలు జరిగిన చోట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొండిగా జీతాలు చెల్లించడానికి నిరాకరిస్తున్నాయి. విశాఖ స్టీల్‌ప్లాంట్, టిటిడి కార్మికులతో సహా సమ్మె కాలంలో జీతాలు కోల్పోయినప్పటికీ కార్మికులు త్యాగం చేసి పోరాటాలు చేస్తున్నారు. అంగన్‌వాడీ కార్మికులు సమ్మె కాలపు జీతాలు సాధించడం మంచి విజయం.

రాష్ట్ర ప్రభుత్వ అధికారులు ఇప్పటికే మినిట్స్ కాపీ తయారు చేశామని తెలిపారు. మంత్రుల ఆమోదం తీసుకొని యూనియన్‌లకు తర్వలో ఇస్తారు.

సంపూర్ణ సన్నాహాలు చేస్తేనే విజయం సాధిస్తామని, ఎటువంటి ఆటంకాలనైనా ఎదుర్కోవడానికి సిద్ధపడాలని కార్మికులు ముందుగానే నిర్ణయించుకున్నారు. గట్టి పట్టుదలతో నిలబడ్డారు. జగన్ ప్రభుత్వం దిగి వచ్చేదాకా పోరాటం సాగించారు. లబ్ధిదారుల మద్దతు కూడగట్టడం ఈ పోరాట విజయంలో ముఖ్య ఘట్టం. అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు బద్దలుకొట్టడాన్ని సెంటర్లు తెరవడాన్ని లబ్ధిదారులు అడ్డుకున్నారు. మా టీచర్ ఆయా వస్తేనే మేము సెంటర్లకు వస్తామని పిల్లలు నిలబడ్డారు. యావత్తు కార్మికవర్గం అంగన్‌వాడీల పక్షాన నిలబడింది. రాష్ట్రంలోని కార్మిక వర్గం అంగన్‌వాడీల పోరాటానికి మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 9 మరియు 20న అన్ని జిల్లాల్లో రాస్తారోకోలు చేశారు. జాతీయ రహదారిపై బైటాయింపులు చేపట్టారు. నిరసనలు తెలిపారు. నిధులు వసూళ్ళు చేసి అపూర్వ మద్దతు ప్రకటించారు. ప్రభుత్వం దిగివచ్చిన తరువాత సకాలంలో పోరాటాన్ని ముగించారు. అంగన్‌వాడీలు గత రెండేళ్ళల్లో హర్యానా, ఢిల్లీ, బీహార్, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో మంచి పోరాటాలను నడిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎస్మా ప్రయోగించినా ఎదిరించి విజయం సాధించేవరకు పోరాడారు. దేశవ్యాప్తంగా జరిగిన అంగన్‌వాడీల సమ్మెలన్నింటిలో ఆంధ్రప్రదేశ్‌లో మెరుగైన ఒప్పందం సాధించింది. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌జిఓలకు పిఆర్‌సిలో కోత వేసింది. విద్యుత్ ఉద్యోగులను దగా చేసింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేస్తామన్న మాట తప్పింది. ఇటువంటి పరిస్థితుల్లో అంగన్‌వాడీలు సాధించుకున్న విజయం సాపేక్షంగా మెరుగైనది. అంగన్‌వాడీ పోరాట అనుభవాలను యావత్తు కార్మికవర్గం ఆదర్శంగా తీసుకుందాం.

*/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /*

నివాళి



# పెద్దన్న ... ఒక ధిక్కార స్వరం!

రాయలసీమలో పెద్దన్నగా పేరుగాంచిన ఒక ధిక్కార స్వరం, పీడిత ప్రజల పెద్ద గొంతుక జనవరి 14వ తేదీన 76 సంవత్సరాల వయసులో మూగబోయింది. పీడిత ప్రజల కోసం నిరంతరం పరితపిస్తూ, కడ వరకూ ప్రజాందోళన కార్యక్రమాలలో భాగస్వామి అయిన 'ఉద్యమాల పెద్దన్న' ఇకలేరు.

సామాజికంగా అణచివేతకు గురయ్యే రజక వృత్తిజేసే కులంలో జన్మించిన పెద్దన్న, సిపిఐ (ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ సభ్యునిగా, పార్టీ అనంతపురం జిల్లా కార్యదర్శిగా, రీజనల్ కమిటీ సభ్యునిగా పలు ముఖ్యమైన బాధ్యతలను పెద్దన్న నిర్వహించారు. ఏఐఎఫ్ టియు (న్యూ) కేంద్ర కార్యవర్గ సభ్యునిగా, రాష్ట్ర అధ్యక్షునిగా చివరి వరకు బాధ్యతలు నిర్వహించారు. 1998లో పార్లమెంటు ఎన్నికలలో పోటీ చేయాలనే పార్టీ ఆదేశానుసారం తన ఉద్యోగానికి రాజీనామా చేసిన పెద్దన్న, తదనంతర కాలంలో పూర్తికాలం కార్యకర్తగా పార్టీ కార్యక్రమాలలో నిమగ్నమయ్యారు.

పెద్దన్న మంచి గుర్తింపు కలిగిన కళాకారుడు. యువజన సంఘం కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ అనంతపురం కేంద్రంగా రాజకీయ కృషిలో ముఖ్యమైన పాత్ర నిర్వహించారు. 1974లో యువజన కాలనీ ఏర్పాటు నుంచి, ముఖ్యంగా అనంతపురం పట్టణంలో పలు కాలనీల నిర్మాణానికి గట్టి కృషి చేశారు. ఈ క్రమంలో పెత్తందార్ల, రౌడీల, పోలీసుల దాడులను, కేసులను ఎదుర్కొన్నారు. అత్యవసర పరిస్థితి కాలంలో అరెస్టయి, జైలు నిర్బంధానికి గురయ్యారు.

విప్లవ కార్మికోద్యమ నాయకునిగా అనంతపురంలో అసంఘటిత రంగంలోని హమాలీలు, ఆటోడ్రైవర్లు, విద్యుత్ కార్మికులు, ఆయిల్ ఫెడ్ మొదలైనవారిని యూనియన్లలోకి సంఘటితం చేసే కృషి జరిపారు. పంచాయితీరాజ్ శాఖలోని పంప్ మెకానిక్‌లను రాష్ట్ర వ్యాపిత సంఘంగా సమీకృతం చేశారు. తెలుగు గంగ హెచ్.ఆర్ కార్మికులను సంఘంగా ఏర్పరచి, వారి హక్కుల సాధన కోసం నిరంతరం కృషి సాగించి విజయం సాధించారు.

శ్రోత్రియం భూముల సమస్య, ఈనాం భూములు, కణేకల్లులో పేదల ఇళ్ళ నిర్మాణం, రాయదుర్గం చేనేత కార్మికుల సమస్యలు, భగత్‌సింగ్ కాలనీ నిర్మాణం తదితర అంశాలలో తిమ్మారెడ్డి గారితో కలిసి జిల్లా ఉద్యమ నిర్మాణంలో పెద్దన్న భాగస్వాములయ్యారు. రాయలసీమ కరువు, ప్రజల దుర్భర స్థితిగతుల గురించి అన్ని వేదికలపైన పెద్దన్న స్పష్టంగా మాట్లాడేవారు.

బొమ్మనహాళ్‌లో 1998లో పేద ప్రజలపై అక్కడి భూస్వామ్య, పెత్తందార్లు కిరాతకంగా సాగించిన హంతక దాడిని తీవ్రంగా ఖండించి బాధిత ప్రజలకు మద్దతునందించటంలో ముందున్నారు. రాష్ట్రంలోని కొండమొదలు, దుగ్గేరు, మునుగోపుల, పల్నాడు రైతాంగ ఉద్యమాలపై నిర్బంధం, నాయకుల హత్యలను ఖండించటమేగాక, ప్రత్యక్షంగా ఆ ఉద్యమ ప్రజానీకాన్ని కలిసి వారికి ధైర్యాన్నందించారు. కర్ణాటకలోని బళ్ళారి ప్రాంతంలో బ్యాంకుల వడ్డీ దోపిడీలను నిరసిస్తూ రైతులు సాగిస్తున్న ఉద్యమాలకు అండగా నిలిచారు.

టి.ఎన్. మెమోరియల్ ట్రస్టుకు పెద్దన్న కొంత కాలం కార్యదర్శిగా పనిచేశారు. 1970లలో కా॥నాగిరెడ్డి ఆధ్వర్యంలో యువకునిగా తమ చేతుల నుండి వెలువడిన 'జనశక్తి' పత్రిక పట్ల అదే మమకారాన్ని, అనుబంధాన్ని ప్రదర్శించేవారు. నాగిరెడ్డి అమరులైన తర్వాత క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం జులై 28న ఆయన వర్ధంతిని పెద్దన్న నాయకత్వంలో ఒక రాజకీయ కార్యక్రమంగా జరపటం గొప్ప విషయం. అలాగే 2017లో తరిమెల నాగిరెడ్డి శత జయంతి సందర్భంగా పార్టీ నాయకత్వాన తరిమెలలో, అనంతపురంలో జరిగిన కార్యక్రమాల పట్ల ఎంతో సంతృప్తిని వ్యక్తం చేశారు.

రెండు మూడు సంవత్సరాలుగా పెద్దన్నను అనారోగ్యం వెంటాడుతున్నా కడదాకా ప్రజా కార్యక్రమాలలో మనోధైర్యంతో పాల్గొంటూనే వున్నారు. అంగన్‌వాడీల దీర్ఘకాల ఆందోళనకు తీవ్ర అనారోగ్యంలోనూ స్వయంగా వెళ్ళి మద్దతునందించి వచ్చారు. పార్టీలో, కుటుంబంలో ఒడిదుడుకుల నడుమ మార్క్సిజం పట్ల, పార్టీ నాయకత్వం పట్ల దృఢమైన విశ్వాసంతో ఆఖరి శ్వాస వరకు కొనసాగిన పెద్దన్నకు విప్లవ జోహార్లు తెలియజేస్తూ, ఆయన జీవితాన్ని అంకితం చేసిన ఆశయాల సాధన కోసం విప్లవ దీక్షతో ముందుకు సాగుదాం!

**- ముప్పాళ్ళ భార్గవశ్రీ,**
సిపిఐ ఎంఎల్ నాయకులు, సెల్ : 9848120105.
(28న అనంతపురం రజక నగర్‌లో పెద్దన్న సంస్మరణ సభ)

సమస్య

# ఓపిఎస్‌పై ఎవరెటు?




'ప్రజలకు సేవ చేయడానికే మా జీవితం. మాది ప్రజల పక్షం' అంటూ కొన్ని రాజకీయ పార్టీల నేతలు పదేపదే చెబుతూ ఉంటారు. తీరా కీలక సందర్భం వచ్చినప్పుడు మనకు నచ్చజెప్పి, ఎదుటి పక్షం వైపు నిలబడడం, అందరినీ కలుపుకోవడం కోసం అని చెప్పడం, అంతిమంగా తమ వర్గ ప్రయోజనం కోసం నిలబడడం. అందుకే చెప్పే మాటలను బట్టి కాకుండా, కీలక సమయంలో ఎటువైపు నిలబడుతున్నారనేది బట్టి వారు ఎవరి పక్షమో తెలుస్తుంది. సిపిఎస్ విధానం తప్పని ఓ.పి.యస్ అమలు చేస్తామని చెప్పి చిత్తశుద్ధితో అమలు చేస్తున్నదెవరు? హామీని హామీగానే ఉంచిందెవరు? పోరాటం చేస్తుంటే మద్దతు ప్రకటించకుండా చోద్యం చూస్తున్నదెవరు? నిశితంగా గమనిస్తేనే ఎవరు ఏ పక్షమో తెలుస్తుంది.

ప్రజల హక్కుల్ని మార్కెట్ శక్తులకు వదిలేసే విధానాన్ని అమలు చేయాలనే ప్రపంచబ్యాంకు, ఐ.ఎం.ఎఫ్ సంస్థల ఆదేశాలను తూ.చా తప్పకుండా పాటించే దానిలో భాగంగా వచ్చిందే పి.ఎఫ్.ఆర్.డి.ఏ చట్టం. వామపక్షాలు తప్ప అన్ని పార్టీలు సమర్థించాయి. 2003 డిసెంబర్ 22న సి.పి.ఎస్. తెస్తున్నామని రాష్ట్రాలు అమలు చేసుకోవచ్చని నాటి కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జనవరి 2004 నుండి కేంద్ర ప్రభుత్వం, సెప్టెంబర్ 2004 నుండి రాష్ట్ర ప్రభుత్వం సి.పి.ఎస్.ని అమలు చేసేశాయి.



ఎన్.వెంకటేశ్వర్లు

**ప్రస్తుతం సిపిఎస్ ...**

సి.పి.ఎస్. రద్దు చేయలేమని పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటన. మరొపక్క ఛతీస్‌గఢ్, రాజస్థాన్, పంజాబ్, జార్ఖండ్ హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడమే కాదు, అమలు చేస్తున్నాయి కూడా. తాజాగా కర్ణాటక, తమిళనాడు, అస్సాం, తెలంగాణ రాష్ట్రాలు పాత పెన్షన్ అమలు చేయడానికి అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ప్రకటించాయి. కాగా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిపిఎస్‌ను వారంలో రద్దు చేసి, పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకుండా, పాత పెన్షన్ ఇవ్వలేమంటూ...దాని స్థానంలో గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్ (జి.పి.ఎస్.)ని అమలు చేస్తామని మరో కొత్త పెన్షన్ విధానాన్ని ముందుకు తెచ్చింది. సి.పి.ఎస్. విధానాన్ని తొలిత ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ...తాను పరిపాలిస్తున్న రాష్ట్రాలలో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించి అమలు చేస్తుండడం విశేషం. మిగిలిన రాజకీయ పక్షాలు కూడా వాటి వైఖరి ఏమిటో ప్రకటించాల్సిన అవసరం ఉంది. అంతే తప్ప ప్రకటనలు, చర్చలు, కమిటీల ఏర్పాటుతో ఎటువంటి ఉపయోగం లేదని ఉద్యోగులు భావిస్తున్నారు. సి.పి.ఎస్, జి.పి.ఎస్ రద్దు తప్ప మరో ప్రత్యామ్నాయం దేనిని అంగీకరించబోమని ఉద్యోగ, ఉపాధ్యాయులు ప్రకటిస్తున్నారు.

**రాష్ట్రంలో పార్టీల వైఖరి ...**

2004 సెప్టెంబర్ 1 నుంచి సిపిఎస్ అమలు చేయడానికి నాటి రాజశేఖర్ రెడ్డి (కాంగ్రెస్) ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. నాటి ప్రతిపక్షం తెలుగు దేశం ఎలాంటి ప్రతిఘటన లేకుండా సిపిఎస్ అమలుకు సహకరించింది. సిపిఎస్ రద్దు చేయాలని ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు 2019 ఎన్నికలకు ముందు పెద్దఎత్తున పోరాటం చేశాయి. "సిపిఎస్ రద్దు చేస్తారా గద్దె దిగుతారా" అనే నినాదం రాజకీయ పార్టీల్లో కదలిక తెచ్చింది. 2019కి ముందు అధికారంలో ఉన్న నాటి ప్రభుత్వం టక్కర్ కమిటీని నియమించి 50 శాతం పెన్షన్ మాత్రం ఇస్తామంటూ ప్రతిపాదించింది. అదే సందర్భంలో పాదయాత్రలో ఉన్న ప్రస్తుత రాష్ట్ర అధినేత అధికారంలోకి వచ్చిన వారంలో రద్దు చేస్తారని ప్రకటించి మేనిఫెస్టోలో పెట్టడంతో ఉద్యోగ సంఘాలన్నీ నమ్మాయి. కాని, నాలుగు సంవత్సరాల తర్వాత సిపిఎస్ రద్దు చేయడం సాధ్యం కాదని, ఆర్థిక పరిస్థితికి ఇబ్బంది అని మరొక ప్రత్యామ్నాయం అయినటువంటి "గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్"ని అమలు చేస్తామంటూ చట్టం చేశారు. అయితే "సిపిఎస్, జిపిఎస్ వద్దు-పాత పెన్షన్"ని అమలు చేయాలనే పోరాటాలు ఊపందుకుంటున్నాయి. రకరకాల వేదికల ద్వారా పెద్ద ఎత్తున ప్రతిఘటన ప్రారంభమైంది. కాని, ప్రభుత్వం జిపిఎస్ అమలు వైపే మొగ్గు చూపుతోంది. కేంద్ర ప్రభుత్వం కూడా సిపిఎస్ రద్దు చేస్తే ఎన్.ఎస్.డి.ఎల్ లో దాచుకున్న సొమ్మును తిరిగి చెల్లించబోమంటూ బెదిరిస్తున్నది. సి.పి.ఎస్.రద్దు అంశం కేంద్ర ప్రభుత్వం చేతుల్లో ఉన్నదని రాష్ట్రాలు చెబుతుంటే, కాదు రాష్ట్ర ప్రభుత్వ చేతుల్లోనే ఉందని కేంద్రం చెబుతున్నది. ఈ సందర్భాన్ని ఆసరాగా తీసుకుని కొన్ని సంఘాల్ని ప్రోత్సహిస్తూ సంఘటిత ఉద్యమాన్ని బలహీనపరిచే వైఖరి కొన్ని పక్షాలు తీసుకుంటున్నాయి.

**ఓట్ ఫర్ ఓ.పి.ఎస్**

ఇది ఉద్యోగ, ఉపాధ్యాయుల నినాదమే కాదు, ప్రజల నినాదం కూడా. 1982 డిసెంబర్ 17న "డి.ఎస్.నకార వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా" కేసులో వై.వి చంద్రచూడ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం పెన్షన్‌పై ఒక చారిత్రాత్మక తీర్పునిచ్చింది. పెన్షన్ ఉద్యోగి ప్రాథమిక హక్కు. గత సేవలకు ప్రతిఫలం మాత్రమే. ఎవరి దయాధర్మ భిక్ష కాదు. రద్దు చేసే అధికారం ఏ ప్రభుత్వానికి లేదు. ఆర్థిక న్యాయం చేకూర్చే సంక్షేమం మాత్రమే. "ప్రతి ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి గౌరవంగా జీవించడానికి ఇచ్చే జీవన భృతి" అని తీర్పు చెప్పింది. రేపు ఉద్యోగానికి రాబోయే వారికి సామాజిక భద్రత ఉండాలంటే "పాత పెన్షన్" కావాలి. పెన్షన్ హక్కుపై పార్టీల వైఖరిని స్పష్టం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. గతంలో ఏం చెప్పారు? ఏం చేశారనే దాని కంటే ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ అయిన "పాత పెన్షన్"పై ఒక స్పష్టమైన విధానం ప్రకటించాలి. ఈ రాష్ట్రంలోని రాజకీయ పార్టీలన్నీ ఉద్యోగుల పక్షాన నిలబడాలని వారు కోరుకుంటున్నారు. పాత పెన్షన్ ఇచ్చే వారికే ఓటు ఇచ్చి బలపరుస్తామని బహిరంగంగా ప్రకటన చేస్తున్నారు. అందుకని పాత పెన్షన్‌ని రాజకీయ, ఆర్థిక కోణంలో కాకుండా సామాజిక భద్రత కోణంలో చూడాలి. "కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ రంగంలోని వారికి ఎలాంటి పెన్షన్ విధానం లేదు. వీరికి కూడా ఉద్యోగ భద్రత కల్పించాలి. పెన్షన్ విధానాన్ని ప్రకటించాలి" అనే డిమాండ్ కూడా ఈ రోజు ముందుకు వస్తున్నది. పాత పెన్షన్ ఇస్తే ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తమవుతుందని కొందరు అప్రకటిత మేధావులు ప్రచారం చేస్తున్నారు. కార్పొరేట్లకు ప్రతి సంవత్సరం లక్షల కోట్లు పన్ను రాయితీలు ఇవ్వడం వల్ల రాని ఆర్థిక నష్టం పాత పెన్షన్ వల్ల వస్తుందని చెప్పడంలో ఆంతర్యాన్ని గమనించాలి. ఇప్పటికైనా రాజకీయ పార్టీలు పాత పెన్షన్‌పై ఒక స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి. ఉద్యోగులందరికి సామాజిక భద్రతను కల్పించాలి. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుని అమలు చేయాలని కోరే శక్తులకు మద్దతుగా నిలబడాలి.

*/ వ్యాసకర్త యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు/*

**మీ రచనలను పంపాల్సిన మెయిల్ :**
editpageps@gmail.com



ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో నిర్వహించిన పరేడ్‌లో ఆంధ్రప్రదేశ్ శకటం


మోటారు బైకులపై మహిళా జవాన్ల విన్యాసాలు


భారత ఎన్నికల సంఘం శకటం

# ఘనంగా గణతంత్ర దినోత్సవం

- కర్తవ్యపథ్ పై మువ్వన్నెల జెండా రెపరెపలు
- జాతీయ జెండా ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము
- ముఖ్య అతిథిగా ఫ్రెంచ్ అధ్యక్షులు మాక్రాన్
- నారీ శక్తిని చాటేలా సాగిన పరేడ్


ఫ్రాన్స్ అధ్యక్షులు ఇమ్మాన్యుల్ మాకాన్, ప్రధాని మోడీతో కలిసి వేడుకలను వీక్షిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము


గుర్రపు బగ్గీలో వేడుకలకు విచ్చేస్తున్న ద్రౌపది ముర్ము, ఇమ్మాన్యుల్ మాక్రాన్

**ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో**

దేశ రాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. భారత నారీశక్తిని చాటేలా పరేడ్ సాగింది. కత్తితో కవాతు చేయడం మొదలు... సాంప్రదాయ బ్యాండ్ల వాయిస్తూ, రక్షణ వ్యవస్థలను లీడ్ చేస్తూ, రాష్ట్ర/కేంద్ర శకటాలను వివరిస్తూ, మోటర్ బైక్స్ పై ఒళ్లు గగురుపొడిచేల విన్యాసాలతో మహిళలు తమ శక్తియుక్తులను ప్రదర్శించారు. కాగా 40 ఏళ్ల తరువాత గుర్రపు బగ్గీలో కర్తవ్య పథ్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము... అనంతరం జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ సారి వేడుకలకు ముఖ్య అతిథిగా ఫ్రెంచ్ అధ్యక్షులు ఇమాన్యూవల్ మాక్రాన్ హాజరయ్యారు. ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు, పెద్ద సంఖ్యలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. తొలిసారి 112 మంది మహిళా కళాకారులు భారతీయ సంగీత వాయిద్యాలను వాయిస్తూ.. పరేడ్ ను ప్రారంభించారు. అనంతరం ప్రారంభమైన కవాతు దేశ నారీ శక్తిని చాటింది. త్రివిధ దళాలు, పారా మిలటరీ బలగాలు, ఢిల్లీ పోలీస్, ఎన్‌సిసి, ఎన్ఎస్ఎస్ కంటింజెంట్లకు మహిళలు సారథ్యం వహించడం ఈ వేడుకల్లో విశేషం.

త్రివిధ దళాలు భారత అమ్ముల పొదిలోని అత్యాధునిక ఆయుధాలు, యుద్ధ ట్యాంకులు, అణ్వాయుధాలను ప్రదర్శించించాయి. నాగ్ మిస్సైల్ వ్యవస్థ, మొబైల్ మైక్రో వేవ్, బిఎంపి 2/2, ఆల్ టెర్రియన్ వెహికల్స్, పణిక, సర్వత్ర మొబైల్ బ్రిడింగ్ సిస్టం సగర్వంగా ముందుకు సాగాయి. అలాగే సిగ్నల్ వ్యవస్థ, డ్రోన్ జామర్ సిస్టం, అడ్వాన్స్ రేడియో ఫ్రిక్వెన్సీ మానిటరింగ్ సిస్టం, సర్ఫేస్ ఎయిర్ మిజెస్ సిస్టం, మూడు అత్యాధునిక రుద్ర, ఒక ప్రచండ హెలికాప్టర్స్ ను ఈ వేడుకల్లో ప్రదర్శించారు.


'ప్రజాస్వామ్య తల్లి' (మథర్ ఆఫ్ డెమోక్రసీ) నేపథ్యంతో మొత్తం 25 శకటాలను కర్తవ్యపథ్ పై సందడి చేశాయి. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు చెందిన 16 శకటాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలకు చెందిన 9 శకటాలు పరేడ్‌లో పాల్గొన్నాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి ద్విభాషా పుస్తకాలు, ట్యాబ్‌లు పట్టుకున్న విద్యార్థులను ప్రధానంగా విద్యా రంగానికి విశేష ప్రాధాన్యతనిస్తూ శకటాన్ని రూపొందించారు. తెలంగాణలో గిరిజన మహిళల చైతన్యాన్ని ప్రతిబింబిస్తూ శకటాన్ని ప్రదర్శించారు. తమిళనాడు చోళ సామ్రాజ్యపు నాటి మహిళ ధీరత్వాన్ని ప్రదర్శించగా, ఉత్తరప్రదేశ్ 'అయోధ్య బాలక్ రామ్' థీమ్‌తో శకటాన్ని ప్రదర్శించి ఇక్కడ కూడా మతతత్వ రంగు పులుముకుంది. శకటాల ప్రదర్శన అనంతరం 54 యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు నింగిలో విన్యాసాలు చేశాయి.

# మళ్లీ బిజెపి పంచన చేరనున్న నితీష్!

- రోజంతా జోరుగా ప్రచారం

**పాట్నా:** బీహార్‌లో మళ్లీ రాజకీయ రంగులు మారుతున్నాయి. రాజకీయ నిలకడలేనితనానికి మారుపేరుగా మారిన ముఖ్యమంత్రి నితీష్ కుమార్ మళ్లీ బిజెపి పంచన చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది.. రిబిప్లక్ డేను పురస్కరించుకుని శుక్రవారం మధ్యాహ్నం గవర్నరు ఆనవాయితీగా ఇచ్చే తేనీటి విందుకు నితీష్ కుమార్ హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి , ఆర్జెడి నేత తేజస్వియాదవ్ మాత్రం దీనికి దూరంగా ఉన్నారు. ఈ నెల 28 (ఆదివారం) నాటి బహిరంగ కార్యక్రమాలన్నిటినీ ఆయన రద్దు చేసుకున్నారు. ఎప్పుడు పిలిస్తే అప్పుడు అందుబాటులో ఉండాలంటూ జెడి(యు), బిజెపి రెండూ తమ ఎమ్మెల్యేలకు, ఎంపీలకు అత్యవసర సమన్లు జారీ చేశాయి. రాజకీయాల్లో ఎప్పటిలాగే ఎవరికీ శాశ్వతంగా తలుపులు మూయడం ఉండదని బిజెపికి చెందిన మాజీ ఉప ముఖ్యమంత్రి, ప్రస్తుతం ఎంపీగా ఉన్న సుశీల్ మోడీ వ్యాఖ్యానించారు. బిజెపితో జెడి(యు) చేతులు కలపడాన్ని వ్యతిరేకిస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు లాలన్ సింగ్‌ను ఆ పదవి నుంచి నితీష్ తొలగించారు. రోజంతా రకరకాల ప్రచారాలు సాగుతున్నాయి. వీటన్నిటిని బట్టి ఆదివారం నితీష్ తన మంత్రివర్గాన్ని రద్దు చేసి, బిజెపితో కలసి తిరిగి కొత్త మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే సూచనలు కనిపిస్తున్నాయి.

త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీహార్‌లో ఎలాగైనా పట్టు పెంచుకోవాలన్న దాంతో ఇండియా ఫోరమ్ నుంచి జెడి(యు)ను తప్పించాలనేది బిజెపి పన్నాగం. దీనికి అంగీకరిస్తే నితీష్‌నే మళ్లీ ముఖ్యమంత్రిగా కొనసాగించి, రెండు ఉప ముఖ్యమంత్రి పదవులను తమ వారికి ఇచ్చుకునేలా ఒక డీల్ కూడా కుదిరినట్లు వార్తలొస్తున్నాయి. నితీస్ ప్రస్తుతం ఆర్జెడి, కాంగ్రెస్‌తో కలసి ప్రభుత్వం నడుపుతున్నారు. బిజెపి యేతర ప్రతిపక్షాలన్నిటిని ఐక్యం చేసేందుకు గత ఏడాది నితీష్ కృషి చేశారు. పాట్నా వేదికగా 'ఇండియా' ఫోరం తొలి సమావేశం నిర్వహించారు.



అటువంటి వ్యక్తి హఠాత్తుగా ఎందుకు ఎన్డీయే పంచన చేరేందుకు తహతహలాడుతున్నారో తెలియడం లేదు. ఇంతలోనే ఏం మార్పు వచ్చింది? 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు ప్రధాని పదవికి ఎన్డీయే అభ్యర్థిగా మోడీ నామినేట్ కావడంతో నితీస్ ఆ కూటమి నుంచి బయటకు వచ్చారు. 2015 బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జెడీ, కాంగ్రెస్‌తో కలసి మహా ఘటబంధన్ తరపున పోటీ చేశారు. అయితే 2020 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపితో చేతులు కలిపారు. ఆ ఎన్నికల్లో జెడి(యు) పరిస్థితి దయనీయంగా తయారైంది. దీంతో ముఖ్యమంత్రి పదవి నితీష్‌కు ఇచ్చినా బిజెపి ఆయనకు ప్రాధాన్యతను తగ్గించింది. దీంతో నితీష్ ఎన్డీయే కూటమికి రాం రాం చెప్పి ఆర్జెడి, కాంగ్రెస్‌తో కలసి ప్రభుత్వం ఏర్పాటు చేశారు. ఇప్పుడు మళ్లీ బిజెపి వైపు చూస్తున్నారు.

ఇండియా ఫోరమ్ ఏర్పాటైన దగ్గర నుంచి బిజెపికి భయం పట్టుకుంది. మూలన పడిపోయిన ఎన్డీయేను 'ఇండియా' ఫోరమ్‌కు దీటుగా తిరిగి తెరపైకి తెచ్చేందుకు యత్నాలు ప్రారంభించింది. హిందీ బెల్టులో భాగంగా ఉన్న బీహార్‌లో బిజెపి పరిస్థితి ఏమంత బాగోలేదని ఇటీవల ఓ సర్వేలో తేలింది. దీంతో కొత్త పొత్తులు పెట్టుకోవడంతో బాటు, ప్రతిపక్షాలను చీల్చేందుకు అన్ని రకాల ట్రిక్కులను ప్రయోగిస్తోంది. నితీష్‌ను దువ్వడం ద్వారా బీహార్‌లో తన బలాన్ని పెంచుకోవచ్చని బిజెపి ఆశ. కానీ, నితీష్ నమ్మదగిన నాయకుడు కాదని, ఆయనతో పొత్తు వద్దని బిజెపి స్థానిక నాయకులు కొందరు పార్టీ అధిష్టానానికి చెబుతున్నారు. నితీష్ బిజెపితో చేతులు కలపడంపై జెడి(యు)లో కూడా కొందరు వ్యతిరేకిస్తున్నారు. కాబట్టి నితీష్‌తో పొత్తు కుదిరినా బిజెపి ఆశించినట్లుగా బీహార్‌లో అది పుంజుకునే అవకాశాలు లేవని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

### 'ఇండియా'తోనే ఉన్నాం..కానీ.. : జెడియు

ఇండియా బ్లాక్‌తోనే ఉన్నామని, అయితే సీట్ల సర్దుబాటుపై కాంగ్రెస్ 'ఆత్మపరిశీలన' చేసుకోవాలని జెడి(యు) జెడి(యు) రాష్ట్ర అధ్యక్షులు ఉమేష్ సింగ్ కుస్వాహ ఒక ప్రకటనలో తెలిపారు. బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎలోకి జెడి(యు) తిరిగి వెళుతుందని ప్రచారం సాగుతున్న నేపథ్యంలో ఉమేష్ సింగ్ కుస్వాహ ఈ ప్రకటన విడుదల చేశారు. 'నిన్నటి మాదిరిగానే ఈ రోజు కూడా ముఖ్యమంత్రిని కలిసాను. అలాగే చక్కర్లు కొడుతున్న పుకారుల్లో ఎలాంటి నిజం లేదు. అలాగే పార్టీ ఎమ్మెల్యేలను పాట్నాకు రమ్మని కోరినట్లుగా వచ్చిన పుకార్లను కూడా మేం తిరస్కరిస్తున్నాం' అని కుస్వాహ తెలిపారు. శుక్రవారం రిపబ్లిక్ పరేడ్‌లో ముఖ్యమంత్రి నితీష్‌కుమార్, ఉపముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ దూరంగా, దూరంగా కూర్చోవడాన్ని కుస్వాహ తెలిగ్గా తీసుకున్నారు. ఇండియా బ్లాక్‌తో కలిసే ఉన్నామని అన్నారు. 'అయితే వేదికలోని కాంగ్రెస్ పార్టీ ఇతర పార్టీలు, సీట్ల సర్దుబాటుపై ఆత్మ విమర్శ చేసుకోవాలని మేం కోరుకుంటున్నాం. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికలపై దృష్టి పెట్టేందుకు వీలుగా సీట్ల పంపకాల ఒప్పందాన్ని త్వరగా ఖరారు చేయాలని మా నాయకులు నితీష్ కుమార్ చాలా కాలంగా ప్రస్తావిస్తున్నారు' అని కుస్వాహ పేర్కొన్నారు.


గవర్నర్ రవికి నిరసన తెలియజేస్తున్న డిఎంకె సభ్యులు

## గవర్నర్ తేనీటి విందును బహిష్కరించిన డిఎంకె, కాంగ్రెస్

**చెన్నై :** రిపబ్లిక్ డే సందర్భంగా తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవి ఏర్పాటు చేసిన తేనీటి విందు కార్యక్రమాన్ని అధికార డిఎంకె, కాంగ్రెస్ అధికారికంగా బహిష్కరించాయి. గవర్నర్ ఆర్ఎన్ రవి బిజెపి, ఆర్ఎస్ఎస్‌లకు కీలుబొమ్మగా వ్యవహరించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నాయి. గత ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగానూ గవర్నర్ నిర్వహించిన ఇలాంటి కార్యక్రమాన్ని డిఎంకె బహిష్కరించింది. అనేక బిల్లులను ఆమోదించకుండా గవర్నర్ పెండింగ్‌లో ఉంచుతూ తద్వారా రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నారని డిఎంకె విమర్శిస్తుంది. అలాగే అసెంబ్లీ శీతాకాల సమావేశాల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన ప్రారంభోపన్యాసంను చదవకుండా గవర్నర్ అనేక అంశాలను దాట వేశారని ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ఆరోపించారు.

## 28 నుంచి కొనసాగనున్న భారత్ జోడో న్యాయ్ యాత్ర

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర ఈ నెల 28న పశ్చిమబెంగాల్‌లోని జల్పయిగురి వద్ద పునఃప్రారంభం కానుంది. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రెండు రోజుల విరామం అనంతరం ఈ యాత్ర ప్రారంభం కానుందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ శుక్రవారం వెల్లడించారు. మణిపూర్, నాగాలాండ్, అస్సాం, అరుణాచల్ ప్రదేశ్, మేఘాలయ, పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహర్‌ల్లో 12 రోజుల పాటు నిర్విరామంగా సాగిన రాహుల్ యాత్రకు ఈ నెల 25 మధ్నాహ్నం నుంచి విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విరామం తర్వాత జల్పయిగురి వద్ద యాత్ర ప్రారంభం కానుండగా సిలిగురి వద్ద బహిరంగ సభ నిర్వహించి ఉత్తర దీనజ్‌పూర్ జిల్లా లోని సోనాపూర్ బస చేయనున్నారు.

## గనిలో ప్రమాదం

- ఆరుగురు 'ర్యాట్ హోల్' కార్మికులు మృతి

**గౌహతి :** నాగాలాండ్‌లోని వోఖా జిల్లాలో ఒక ర్యాట్ హోల్ బొగ్గు గనిలో అగ్ని ప్రమాదం సంభవించి ఆరుగురు కార్మికులు మరణించారు. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదం గురువారం మధ్నాహ్నం 12.30 ప్రాంతంలో సంభవించింది. భండారి అసెంబ్లీ నియోజకవర్గంలోని రైసయన్ అనే గ్రామంలోని గనిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాధిత కార్మికులంతా అస్సాంకు చెందినవారిగా గుర్తించారు. శాస్త్రీయ మైనింగ్ కోసం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోకపోతే ఇలాంటి ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయని స్థానిక ఎమ్మెల్యే అచుంబెమో కికోన్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్‌ను నిరోధించాలని ఎన్నిసార్లు ఆందోళన చేసిన ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఈ ప్రమాదంపై జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. ర్యాట్ హోల్ మైనింగ్‌ను 2014 ఏప్రిల్‌లో జాతీయ హరిత ట్రిబ్యునల్ నిషేధించింది. ఈశాన్య ప్రాంతాల్లో ర్యాట్ హోల్ మైనింగ్ కొనసాగుతూనే ఉంది.

# గాజాలో నరమేధం ఆపండి

- తీసుకున్న చర్యలపై నెల రోజుల్లోగా నివేదిక ఇవ్వండి
- ఇజ్రాయిల్‌ను ఆదేశించిన అంతర్జాతీయ న్యాయస్థానం
- దక్షిణాఫ్రికా పిటిషన్‌పై తీర్పు

**హేగ్ :** గాజాలోని పాలస్తీనియన్లపై సాగిస్తున్న మారణకాండను ఆపాలని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) ఇజ్రాయిల్‌ను ఆదేశించింది. దీనిపై నెల రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కోరింది. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధ నేరాలను ఆపేందుకు కాల్పుల విరమణ ప్రకటించేలా ఆదేశించాలని దక్షిణాఫ్రికా వేసిన పిటిషన్‌ను విచారించిన అంతర్జాతీయ నేర విచారణ ట్రిబ్యునల్ శుక్రవారం ఈ మేరకు తీర్పు చెప్పింది. అయితే కాల్పుల విరమణకు సంబంధించి ఉత్తర్వులు ఇవ్వడానికి అది నిరాకరించింది. ఇజ్రాయిల్ సైన్యం మారణకాండకు పాల్పడకుండా తగు చర్యలు తీసుకోవాలని, మానవతా సాయం అందేలా చూడాలని ఇజ్రాయిల్‌ను ఆదేశించింది. ఈ ప్రాంతంలో జరుగుతున్న మానవ విషాదం గురించి కోర్టుకు తెలుసునని న్యాయస్థానం అధ్యక్షుడు, న్యాయమూర్తి జాన్ ఇ.డొనొగూ వ్యాఖ్యానించారు. ముఖ్యంగా అభం శుభం తెలియని చిన్నారుల పరిస్థితి మరీ దయనీయంగా వుందన్నారు. గాజాలో మొత్తంగా పిల్లలందరూ భయకంపితులవుతున్నారు. వారి భవితవ్యం అంతా గందరగోళంలో పడిందని అన్నారు. ఈ ఆదేశాలకు సంబంధించి తీసుకున్న చర్యలపై నెల రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని కోర్టు ఇజ్రాయిల్‌ను కోరింది. ఈ ఆదేశాలు చట్టపరంగా కట్టుబడాల్సినవని కోర్టు స్పష్టం చేసింది. ఇజ్రాయిల్ బందీలందరినీ విడుదల చేయాలంటూ హమాస్‌ను కూడా కోర్టు కోరింది. ఈ కేసును విడిచి పెట్టాలంటూ ఇజ్రాయిల్ చేసిన అభ్యర్ధనను కోర్టు తిరస్కరించింది. మారణకాండ నేరాల నిరోధానికి సంబంధించి ఐక్యరాజ్య సమితి చేసుకున్న ఒప్పందం పరిధిలోకే ఈ మారణకాండ వస్తుందని, అందువల్ల తమకు రూలింగ్ ఇవ్వడానికి అధికారం వుందని పేర్కొంది.

ఐసిజె నిర్ణయాన్ని పాలస్తీనా స్వాగతించింది. గాజాలో ఊచకోతను నివారించేందుకు ఇజ్రాయల్ అన్ని చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించడాన్ని పాలస్తీనా విదేశాంగ మంత్రి రియాద్ అల్ మలికి స్వాగతించారు. ఏ దేశమూ కూడా చట్టానికి అతీతం కాదని ఈ ఆదేశాలతో స్పష్టమైందని అన్నారు.


తీర్పు వెల్లడిస్తున్న జాన్ ఇ.డొనొగూ

ఇజ్రాయిల్‌కు ఇదొక మేల్కొలుపు వంటిదన్నారు.

**ఆత్మ రక్షణ దాడులు కొనసాగుతాయన్న నెతన్యాహు**

మారణకాండను ఆపాలని అంతర్జాతీయ న్యాయస్థానం ఆదేశించినా నెతన్యాహు ప్రభుత్వం గాజాపై దాడులు కొనసాగించాలనే నిర్ణయించుకుంది. అంతర్జాతీయ న్యాయస్థానం తీర్పుకు కట్టుబడి ఉంటామంటూనే ఆత్మరక్షణ చర్యల్లో రాజీపడేది లేదనడం ద్వారా గాజాలో తమ దాడులు కొనసాగుతాయని చెప్పకనే చెప్పారు గాజాలో తాము సాగించే దాడులు హమస్‌కు వ్యతిరేకంగానే తప్ప పాలస్తీనా పౌరులకు వ్యతిరేకంగా కాదని పాత పాటే పాడారు. మానవతా సాయం అందేలా వెసులుబాటు కల్పించడం కొనసాగుతుందన్నారు.

**తీర్పునకు ఇజ్రాయిల్ కట్టుబడి ఉండాలి : దక్షిణాఫ్రికా**

గాజాలో ఊచకోతను నివారించేందుకు ఇజ్రాయల్ అన్ని చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ కోర్టు (ఐసిజె) ఇచ్చిన తీర్పునకు ఇజ్రాయిల్ కట్టుబడి ఉండాలని దక్షిణాఫ్రికా తెలిపింది. తీర్పు వెల్లడించిన తరువాత దక్షిణాఫ్రికా అధ్యక్షులు సిరిల్ రామఫోసా జాతిని ఉద్దేశించి టెలివిజన్‌లో ప్రసంగించారు, 'ఈ రోజు ఇజ్రాయిల్ అంతర్జాతీయ సమాజం ముందు దోషిగా నిలబడి ఉంది. పాలస్తీనియుల్లపై దాని నేరాలు బయటపడ్డాయి' అని రమాఫోసా తెలిపారు. అలాగే కోర్టు తీర్పును అంతర్జాతీయ శాంతి భద్రతలకు 'నిర్ణయాత్మక విజయం'గా ఆయన ప్రశంసించారు.

## భవిష్యత్ ఉద్యమాలకు దిక్సూచి

(మొదటి పేజీ తరువాయి)

అభినందనీయమన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీల పోరాట పటిమ ఎంతో స్ఫూర్తిదాయమన్నారు.

**హామీల అమలుకు ఆదేశాలు వెంటనే విడుదల చేయాలి : బేబిరాణి**

అంగన్‌వాడీల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు తక్షణం ఆదేశాలు విడుదల చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి డిమాండ్ చేశారు. కాకినాడ కచేరిపేటలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. డిసెంబరు 12న మొదలైన సమ్మె జనవరి 22 అర్ధరాత్రితో ముగిసిందని, దానర్థం పోరాటం ముగిసినట్లు కాదని తాత్కాలిక విరామమేనని స్పష్టం చేశారు. చర్చల సమయంలో తొమ్మిది డిమాండ్లపై నిర్దిష్టంగా ఆదేశాలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించిన తర్వాతే సమ్మె విరమించామని తెలిపారు. సమ్మె కాలానికి వేతనాలు చెల్లించేలా, నాయకులు, అంగన్‌వాడీలపై పెట్టిన కేసులు ఎత్తివేసేలా, తొలగించిన వారందరినీ విధుల్లోకి తీసుకొనేలా, గ్రాడ్యుటీపై కేంద్రానికి నివేదించి, జులైలో యూనియన్ నాయకులతో చర్చించి ఉభయుల అంగీకారం మేరకు వేతనాలు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. చట్టబద్ధమైన సమ్మెకు రాజకీయరంగు పూలమాలని ప్రయత్నించినా మొక్కవోని దీక్షతో అంగన్‌వాడీలు ఐక్యంగా పోరాడి ప్రభుత్వం మెడలు వంచి విజయం సాధించారని అభినందించారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

## గవర్నరు తీరు బాధ్యతారాహిత్యం

- రాజ్యాంగ విధుల పట్ల నిర్లక్ష్యం
- బడ్జెట్ సమావేశాల్లో ఆరీఫ్ తీరుపై సిపిఎం విమర్శలు

**తిరువనంతపురం :** కేరళ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ప్రభుత్వ విధాన ప్రసంగాన్ని రాష్ట్ర గవర్నరు ఆరీఫ్ మహ్మద్ ఖాన్ కొన్ని సెకన్లలోనే ముగించడాన్ని సిపిఎం కేరళ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. రాజ్యాంగ విధుల పట్ల ఆయన నిర్లక్ష్య ధోరణిని ఇది అద్దం పట్టిందని విమర్శించింది. స్థానిక ఎకెజి సెంటర్‌లో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎంవి గోవిందన్ మీడియాతో మాట్లాడుతూ శాసనసభ సమావేశాల్లో గవర్నరు స్థాయికి తగినట్లుగా కాకుండా ఆరీఫ్ దిగజారి వ్యవహరించారని తప్పుబట్టారు. రాజ్యాంగ విధుల పట్ల నిర్లక్ష్యంగా, పట్టీపట్టని రీతిలో వ్యవహరించారని తీవ్రంగా విమర్శించారు. వాస్తవానికి 'సహకార సమాఖ్యవాదం ప్రాముఖ్యత'ను నొక్కి చెబుతున్న పేరాగ్రాఫ్‌ను చదవడం ద్వారా గవర్నరు ప్రసంగ సారాంశాన్ని తెలియజేశారని, కానీ సభలో ఆయన వ్యవహార శైలి చాలా అవమానకరంగా వుందని గోవిందన్ పేర్కొన్నారు. ఈ నెల 25న కేరళ బడ్జెట్ సమావేశాల్లో కేవలం 75 సెకన్లలో గవర్నరు తన ప్రసంగాన్ని ముగించిన సంగతి విదితమే.

**మత ఘర్షణలపై ఆందోళన**

అయోధ్యలో రామ మందిరం ప్రారంభోత్సవం తర్వాత దేశంలో పలు చోట్ల మత ఘర్షణలు చోటు చేసుకోవడం ఆందోళనకరమని గోవిందన్ తెలిపారు. ఉత్తరప్రదేశ్, గుజరాత్, మహారాష్ట్ర, న్యూఢిల్లీ, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు చోట్ల ముస్లింలు, క్రైస్తవులపై దాడులు చేసేలా సంఘపరివార్ ఉద్దేశ్యపూర్వకంగా ప్రేరేపిస్తోందని ఆయన విమర్శించారు. హిందూత్వ ఓట్లను రాబట్టుకునే లక్ష్యంతో మత సామరస్యతను దెబ్బతీసేలా, మైనారిటీలను చెడ్డగా చిత్రీకరిస్తూ విద్వేషాలను రాజేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.




## విశ్వవిద్యాలయాల్లో ప్రయివేటు వద్దు

- గ్రీస్‌లో వేలాది మంది విద్యార్థుల ప్రదర్శన

**ఏథెన్స్ :** ప్రయివేటు విశ్వవిద్యాలయాలను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు జారీ చేసే ప్రయత్నాలను తక్షణమే విరమించుకోవాలని గ్రీస్‌లోని మితవాద ప్రభుత్వాన్ని విద్యార్థులు హెచ్చరించారు. ప్రయివేటీ వర్శిటీల ఏర్పాటును వ్యతిరేకిస్తూ శుక్రవారం ఏథెన్స్ సహా పలు ప్రధాన విశ్వవిద్యాలయాల వల్ల నిరసన ప్రదర్శనలు చేపట్టారు. సెంట్రల్ ఏథెన్స్‌లో గురువారం నిర్వహించిన ప్రదర్శనలో వేలాది మంది విశ్వవిద్యాలయాల విద్యార్థులు పాల్గొన్నారు. ఏథెన్స్‌లోని ప్రధాన యూనివర్శిటీ భవనం ప్లేటో, సోక్రటీస్ విగ్రహాల మీదుగా ఈ నిరసన ప్రదర్శన సాగింది. 2023లో భారీ మెజారిటీతో విజయం సాధించడాన్ని అవకాశంగా తీసుకుని ప్రధాని కిరియాకోస్ మిత్సోటకిస్ నేతృత్వంలోని ప్రభుత్వం అనేక చట్టాలను తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది. తాజాగా తీసుకోబోయే ఈ చర్య వల్ల వేలాది మంది గ్రీకులు ప్రతి ఏటా విదేశాలకు వెళ్లకుండా ఆపడానికి వీలుంటుందని ప్రభుత్వం వాదిస్తోంది. కానీ దీనివల్ల ప్రభుత్వ వర్శిటీలు దెబ్బ తింటాయని దీన్ని వ్యతిరేకించే వాళ్ళు వాదిస్తున్నారు. ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వర్శిటీలు ఇంకా ఇక్కట్ల పాలవుతాయంటున్నారు. చట్టపరమైన సంస్కరణలు, జీవన వ్యయ సంక్షోభం వల్ల ఇటీవలి వారాల్లో వివిధ గ్రూపుల నుండి ప్రభుత్వం నిరసనలను ఎదుర్కొంటోంది. సెంట్రల్ గ్రీస్‌లో గురువారం రైతులు ట్రాక్టర్లతో హైవేలను దిగ్బంధించారు. తమ ఉత్పత్తి వ్యయాలను తగ్గించేందుకు ప్రభుత్వం అదనంగా సాయం చేయాలని వారు కోరుతున్నారు.


ఢిల్లీలో జరిగిన ర్యాలీలో త్రివర్ణ పతాకాలతో హన్నన్ మొల్ల, బి వెంకట్ తదితరులు

## దేశవ్యాప్తంగా కిసాన్ ట్రాక్టర్ పరేడ్

(మొదటి పేజీ తరువాయి)

బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి ఒక హెచ్చరిక అని ఎస్‌కెఎం విమర్శించింది. 2021 డిసెంబరు 9 నాటి రాతపూర్వక హామీని, అన్ని పంటలకూ గ్యారెంటీ సేకరణతో పాటుగా సి2ప్లస్50 శాతంతో కూడిన ఎంఎస్‌పి సహా రైతుల ఇతర ముఖ్యమైన డిమాండ్లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయడానికి రైతుల పోరాటంలో రెండవ దశ కవాతులో భాగమని ఎస్‌కెఎం పేర్కొంది. రైతు, వ్యవసాయ కార్మికులకు సమగ్ర రుణమాఫీ, విద్యుత్ రంగ ప్రైవేటీకరణను నిలిపివేయడం, ప్రీ-పెయిడ్ మీటర్ల ఏర్పాటు ఆపాడం, ఇన్‌పుట్ల ఖర్చు తగ్గించడం, ప్రభుత్వ నియంత్రిత సాధారణ, సార్వత్రిక పంటల బీమాను నిర్ధారించడం, లఖింపూర్ ఖేరీ రైతుల హత్యాకాండకు ప్రధాన కుట్రదారుడు కేంద్ర హోం వ్యవహారాల సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా తేని తొలగింపు, ప్రాసిక్యూషన్ చేయాలని డిమాండ్ చేసింది. ఎస్‌కెఎం ఇప్పటికే ఫిబ్రవరి 16న గ్రామీణ భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఆ రోజున కార్మిక సంఘాలు కూడా పారిశ్రామిక, సెక్టోరల్ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఆ రోజు గ్రామీణ భారతదేశం స్తంభిస్తుందని ఎస్‌కెఎం భావిస్తోంది. ఈ పోరాటాన్ని రాబోయే రోజుల్లో మొత్తం రాష్ట్రాలు, జిల్లాల వరకు గ్రామాల వరకు విస్తరించి, అన్ని డిమాండ్లనూ మోడీ ప్రభుత్వం నెరవేర్చే వరకు మరింత ఉధృతం చేస్తామని పేర్కొంది.



ట్రాక్టర్ ర్యాలీలో విజ్జు కృష్ణన్

వ్యవసాయ సంక్షోభానికి దారితీసిన వ్యవసాయాన్ని కార్పొరేటీకరించడం రైతులు, కార్మికులు, యువత జీవితాలను కూడా నాశనం చేసిందని పేర్కొంది. 2014-2022 మోడీ పాలనలో 1,00,474 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొంది. గత తొమ్మిదేళ్లలో 14.64 లక్షల కోట్ల కార్పొరేట్ రుణాలను మాఫీ చేసినా ఒక్క రూపాయి కూడా రైతుల రుణమాఫీ చేయలేదని తెలిపింది. ఇన్‌పుట్‌లకు సబ్సిడీల ఉపసంహరణ, ధరల పెరుగుదల వ్యవసాయంలో ఉత్పత్తి వ్యయం, రైతు కుటుంబాల రోజువారీ ఖర్చులను పెంచిందని పేర్కొంది. ఎంఎస్‌పి, రుణమాఫీ, ఏడాదికి 2 కోట్ల ఉపాధి హామీ ఎన్నికల వాగ్దానాన్ని ఉల్లంఘించి రైతులకు ద్రోహం చేసిన నరేంద్ర మోడీ, దేశంలో ఎన్నడూ లేనంత రైతు వ్యతిరేక ప్రధాన మంత్రి అని ఎస్‌కెఎం పునరుద్ఘాటించింది.

**మోడీని దించాలి.. దేశాన్ని కాపాడాలి : హన్నన్ మొల్లా, బి వెంకట్**

రైతాంగానికి నష్టం చేసే చర్యలను ప్రధాని మోడీ అవలంభిస్తున్నారని ఎఐకెఎస్ నేత హన్నన్ మొల్లా, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్ విమర్శించారు. శుక్రవారం ఢిల్లీ సరిహద్దుల్లో ట్రాక్టర్లు, వాహనాల పరేడ్‌లో హన్నన్ మొల్లా, బి.వెంకట్ పాల్గొన్నారు. ఫల్వాల్‌లో 21 కిలోమీటర్ల మేర ఈ పరేడ్ జరిగింది. వచ్చే ఎన్నికల్లో ఆరెస్సెస్ అజెండాతో నడుస్తున్న బిజెపిని ఓడించాలన్నారు. 13 కోట్ల మంది రైతులు, 15 కోట్ల మంది వ్యవసాయ కార్మికులు ఉన్న వ్యవసాయ రంగంపై మోడీ నిరంకుశత్వం వ్యవరిస్తున్నారని విమర్శించారు.

**గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ఏడాది ప్రకటించిన 'పద్మ' పురస్కారాల్లో తెలుగురాష్ట్రాల నుండి 8 మంది ఎంపికయ్యారు. ప్రజా వ్యవహారాల్లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు, కళారంగంలో విశిష్ట సేవలందించినందుకు చిరంజీవికి 'పద్మవిభూషణ్' వరించింది. తెలంగాణలో ఐదుగురికి, ఏపీలో ఒకరికి పద్మశ్రీ అవార్డులు దక్కాయి. బుర్రవీణ వాయిద్యకారుడు దాసరి కొండప్ప, యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్య, శిల్పకళాకారుడు వేలు ఆనందాచారి, సాహిత్య కారులు కేతావత్ సోమ్ లాల్, కూరెళ్ల విఠలాచార్య తెలంగాణ నుండి పద్మశ్రీకి ఎంపికయ్యారు. మన రాష్ట్రం నుండి హరికథ కళాకారిణి ఉమా మహేశ్వరి పద్మశ్రీ అందుకున్నారు.**

# పుట్టువులుగ మన ధర్మం!



పుడమి మీద మొక్క లేదు
పురములందు గాలి లేదు
పులుగు రెక్కలాడలేదు
పురుగు పుట్రా కానరాదు!

పులకరింత సుంతలేదు
పుడక కాల్చ మిగలలేదు
పురుషయత్నమేమి లేదు
పూతలేక హరితమేది?

పులుపు, తీపి పండ్లు లేవు
పురుడాడిన మొలక లేదు
పుట్ల కొలది పండు పంట
పుడిసెడైన కానరాదు!

పులులు లేవు గిలులు లేవు
పుట్టబోవు జీవులేవి
పుండైనది ధరణి నేడు
పుటలు వ్రాయ చరితలేదు

పుచ్చపూల మేఘమేది?
పులకిత జీవనమెయ్యది?
పురోగమన మనుపేరున
పుట్ట, గట్టు ప్లాటులయ్యె!

పురాణాలు నాడు వనులు
పుంజుకొన్న కథలు గలవు

పుత్తడి బతుకులు బతికిరి
పుస్తకములు లేని నాడు!

పుష్పాలై విరబూద్దాం
పునీతులుగ చరించుద్దాం
పుడమిని రక్షించుకొనుట
పుట్టువులుగ మనధర్మం!

**- కిలపర్తి దాలినాయుడు,**
**సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు,**
**రామభద్రపురం.**

## నేను గీసిన బొమ్మ





**ఎస్.ముని రెడ్డి,**
**4వ తరగతి,**
**దిగువ సాంబయ్య పాళెం,**
**తొట్టంబేడు మండలం,**
**తిరుపతి జిల్లా.**

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

# విరబూసిన తెలుగు 'పద్మా'లు

### 'హరికథ'కు ఉమామహేశ్వరి వెలుగులు

కృష్ణాజిల్లా మచిలీపట్నంలో పుట్టిన దాలిపర్తి ఉమామహేశ్వరిని పద్మపురస్కారం వరించింది. దేశంలోనే ఏకైక సంస్కృత కథా కళాకారిణిగా ఆమె ప్రసిద్ధి చెందారు. భారతదేశంతో పాటు వివిధ దేశాల్లోనూ ఆమె హరికథా ప్రదర్శనలిచ్చారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం సంగీత నాటక అకాడమీ అవార్డును బహూకరించింది. ఆమె తల్లి సరోజని కూడా గాయని. ఆమె తండ్రి దాలిపర్తి లాలాజీరావు వేములవాడలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో ఆస్థాన విద్వాంసుడిగా మూడు దశాబ్దాలకుపైగా పనిచేశారు. ఉమామహేశ్వరి పదోతరగతి వరకూ చదువుకున్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలోని శ్రీ సర్వారాయ హరికథా గురుకులంలో 14 ఏళ్ల ప్రాయంలోనే చేరారు. విజయనగరం సంస్కృత కళాశాలలో 'రుక్మిణి కల్యాణం హరికథా గానం' తొలి ప్రదర్శనను ఇచ్చారు.

### అ'ద్వితీయ పురస్కారం

తెలుగు సినిమా చరిత్రలో 2011లో అక్కినేని నాగేశ్వరరావు తర్వాత 2024లో కొణిదెల చిరంజీవి పద్మవిభూషణ్‌ను దక్కించుకున్నారు. మెగాస్టార్‌గా తన 67 ఏళ్ల సినీ జీవితంలో 155 సినిమాల్లో నటించారు. సినీరంగానికి చేసిన సేవలకు గాను అప్పటి కేంద్రప్రభుత్వం 2006లో పద్మభూషణ్ అవార్డు ఇచ్చింది. 2016లో రఘుపతి వెంకయ్య అవార్డుతో ప్రభుత్వం ఆయన్ని సత్కరించింది. 2006లో ఆంధ్రా యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. 1987లో దక్షిణ భారతదేశం నుంచి ఆస్కార్ అవార్డుల ప్రధానోత్సవానికి హాజరైన ఏకైక నటుడు చిరంజీవి.

**ప్రజావ్యవహారాల్లో ...**

ప్రజా వ్యవహారాల్లో విశేష కృషి చేసినందుకు రాష్ట్రానికి చెందిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు పద్మ విభూషణ్ దక్కింది. నెల్లూరు జిల్లా చవటపాలెం ఆయన స్వగ్రామం. 1998 నుంచి 2017లో ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టే వరకూ రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరమైనా స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

### తెలంగాణ 'పద్మ'లు

**వారసత్వ కళలో :** బుర్రవీణ వాయిద్య కళాకారుడు దాసరి కొండప్పది పేదరిక కుటుంబం. వారసత్వంగా వచ్చిన కళను వదిలిపెట్టకుండా వ్యాప్తి చేస్తున్నారు. ఈయన స్వస్థలం నారాయణ పేట జిల్లా దామర గిద్ద. పౌరాణిక గాథలను వీణపై వాయిస్తూ చెప్పే కళాకారుల్లో ప్రస్తుతం ఈయనొక్కరే మిగిలిఉన్నారు. గతంలో దూరదర్శన్‌లో ప్రదర్శనలిచ్చారు. వెదురు, పొట్లకాయ పెంకు, లోహపు తీగలతో బుర్రవీణను ఆయనే స్వయంగా తయారుచేసుకుంటారు. 'బలగం' చిత్రంలో 'అయ్యే శివుడా ఏమాయే' అనే పాటను ఆలపించిన గాయకులలో కొండప్ప ఒకరు. కొంతకాలం క్రితం మహబూబ్‌నగర్ కస్తుర్బా పాఠశాల విద్యార్థులకు బుర్ర వీణపై శిక్షణ కూడా ఇచ్చారు. ఆసక్తి ఉన్నవారికి ఇప్పటికీ శిక్షణ ఇస్తున్నారు. కూలీనాలీ చేసుకునే కొండప్ప అడపాదడపా, పండగకు పబ్బాలకు బుర్రవీణ వాయిస్తూ రోజులు వెల్లదీస్తున్నారు.



చిరంజీవి



ఉమామహేశ్వరి



వెంకయ్యనాయుడు



దాసరి కొండప్ప






సమ్మయ్య



వేలు ఆనందాచారి



కేతావత్ సోమ్‌లాల్



కూరెళ్ల విఠలాచార్య

**కళా సేవలో :** చిందు యక్షగానంలో పేరొందిన సమ్మయ్య(62) గొప్ప కళా తృష్ణ ఉన్న వ్యక్తి. కళను బతికించుకోవడం కోసం అహర్నిశలు పాటుపడుతున్నారు. ఈయన స్వస్థలం జనగామ జిల్లా దేవరుప్పుల మండలం అప్పిరెడ్డిపల్లి. నిరుపేద కుటుంబం నుండి వచ్చిన సమ్మయ్యకి తండ్రి నుండి ఈ కళ ఒంటబట్టింది. 12వ ఏట నుండే కళా ప్రదర్శనలు ఇవ్వడం ప్రారంభించిన సమ్మయ్య ఈ ఐదు దశాబ్దాల్లో 19 వేలకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. యక్షగాన కళతో పౌరాణిక ఇతివృత్తాలే కాక సామాజిక అంశాలపై కూడా ప్రజల్లో అవగాహన తేవడం సమ్మయ్య ప్రత్యేకత. అక్షరాస్యత, పర్యావరణ పరిరక్షణపై పాటలు, పద్యాలతో ప్రేక్షకులను చైతన్యం చేసేవారు. 'చిందు యక్ష కళాకారుల సంఘం', 'గడ్డం సమ్మయ్య యువ కళాక్షేత్రం' వంటి కళాక్షేత్రాలు స్థాపించి కళను సజీవంగా ఉంచుతున్నారు. సమ్మయ్య భార్య శ్రీరంజిని కూడా యక్షగానం ప్రదర్శనలు ఇస్తున్నారు. ఇటీవల అయోధ్యలో జరిగిన రామ్‌లల్లా ప్రతిష్ట సందర్భంగా సమ్మయ్య ఐదు ప్రదర్శనలు ఇచ్చారు.

**సాహిత్యకృషిలో :** రెండు తెలుగు రాష్ట్రాల్లో అక్షరయోధుడిగా ఖ్యాతి గడించిన కూరెళ్ల గురించి తెలియని వారుండరు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్న పేట మండలం నీర్నెముల గ్రామానికి చెందిన కవి, రచయిత, సామాజికవేత్త అయిన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య సాహిత్యమే ఊపిరిగా జీవిస్తున్నారు. కవిగా 22 పుస్తకాలను వెలువరించారు. సుమారు రెండు లక్షల పుస్తకాలతో తన ఇంటిని గ్రంథాలయంగా మార్చారు. ఎన్నో విలువైన పుస్తకాలు, గ్రంథాలు ఇందులో నిక్షిప్తమై ఉన్నాయి. ఇక్కడ పరిశోధనలు చేసిన 8 మంది విద్యార్థులు పిహెచ్‌డి సాధించడంలోనే ఈ గ్రంథాలయ విశిష్టతను అర్థం చేసుకోవచ్చు.

**శిల్ప కళలో :** డాక్టర్ వేలుగా ప్రసిద్ధిగాంచిన ఆనందాచారి(72) శిల్ప కళలో నిష్ణాతునిగా పేరుగాంచారు. ఈయన స్వస్థలం చిత్తూరుజిల్లా వెన్నంపల్లి. ఆ తరువాత వీరి కుటుంబం తెలంగాణలో స్థిరపడింది. శిల్ప కళ ద్వారా ఆలయ నిర్మాణాల పర్యవేక్షణ, పురాతన శిల్ప నమూనాలను యథావిధిగా నిర్మించడం ఈయన ప్రత్యేకత. తెలంగాణ ప్రభుత్వ దేవాదాయ, ధర్మాదాయ శాఖలో స్థపతిగా వివిధ స్థాయిల్లో విధులు నిర్వర్తించారు. 2010లో పదవీ విరమణ పొందిన తరువాత కూడా శిల్ప కళకు సంబంధించి పలు ప్రాజెక్టుల్లో సలహాదారునిగా వ్యవహరిస్తున్నారు. కాలం చెల్లిన ఔషధాలతో రంగులు తయారీ, ఔషధాలతో వర్ణ చిత్రాలు వేయడం అనే నూతన ప్రక్రియ ద్వారా చిత్రాలు గీసి, అనేక అవార్డులు, ప్రశంసాపత్రాలు సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం కర్ణాటక, కేరళ, తెలంగాణ తదితర రాష్ట్రాల్లోని వివిధ దేవాలయాల పునర్నిర్మాణ, జీర్ణోద్ధరణ పనులను పర్యవేక్షిస్తున్నారు.

**భాషాభిమాని :** బంజారా భాషలోకి భగవద్గీతను అనువాదం చేసిన భాషా ప్రేమికుడు కేతావత్ సోమ్ లాల్. యాదాద్రి జిల్లా భువనగిరి మండలం ఆకుతోట బావి తండాకు చెందిన సోమ్ లాల్ బ్యాంకు ఉద్యోగి. ఉద్యోగ విరమణ తరువాత సాహిత్యరంగం వైపు అడుగులు వేశారు. బంజారా జాతి జాగృతి కోసం 200కి పైగా పాటలు రాశారు. 1989లో భగవద్గీతను బంజారా భాషలోకి అనువదించినా దాన్ని అచ్చు వేయడానికి 35 ఏళ్లు పట్టింది. 2014లో తిరుమల తిరుపతి దేవస్థానం ఈ గ్రంథాన్ని ప్రచురించింది. సాహిత్యం, కళా రంగాల్లో విశేష సేవ చేసినందుకు వీరందరికీ ఈ ఏడాది 'పద్మ శ్రీ' పురస్కారాలు లభించాయి.



## అందరికీ రుణపడి ఉంటా

● చిరంజీవి

గణతంత్ర దినోత్సవంలో భాగంగా హైదరాబాద్‌లోని చిరు బ్లడ్‌బ్యాంకులో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ ఏడాది పద్మవిభూషణ్ అవార్డుకు ఎంపికైన చిరంజీవి ఈ కార్య క్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. '75వ రిపబ్లిక్ డే సందర్భంగా యావత్ భారతీయులకు నా హృదయ పూర్వక అభినందనలు. ఈరోజున మనం ఇంత స్వేచ్ఛగా ఉంటున్నామంటే అందుకు కారణం.. ఎంతోమంది మహానుభావులు వారి జీవితాలను త్యాగం చేశారు. వారి త్యాగఫలమే ఈ స్వేచ్ఛ. నా 45 ఏళ్ల సుదీర్ఘ సినీ ప్రయాణంలో నేను సినీ కళామతల్లికి నావంతు సేవలందించాను. కళాకారులకు సామాజిక బాధ్యత కూడా ఉందని గ్రహించి.. సాయం కోరిన వాళ్లకు ఎన్నో ఏళ్లుగా అండగా నిలబడ్డా. అందులో భాగంగానే చిరు బ్లడ్‌బ్యాంక్ స్థాపించా. బ్లడ్‌బ్యాంక్ ద్వారా ఎంతోమందికి సేవ చేస్తున్నందుకు గర్వపడుతున్నా. అభిమానులందరికీ రుణపడి ఉంటా' అని ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్మాత అల్లు అరవింద్, వరుణ్‌తేజ్, సుష్మిత కొణిదెల, చిరంజీవి మనవరాళ్లు నవిష్క, సమరతోపాటు పలువురు చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

**అభినందనల వెల్లువ**

పద్మ విభూషణ్ అవార్డుకు ఎంపికైన చిరంజీవికి టాలీవుడ్‌తో పాటుగా దక్షిణాది సినీ పరిశ్రమకు చెందిన పలువురు ప్రముఖులు, బాలీవుడ్ నటీనటులు అభినందనలు తెలిపారు. మలయాళ నటుడు మమ్ముట్టి, చిరంజీవికి కంగ్రాట్స్ చెప్పారు. టాలీవుడ్ హీరోలు ఎన్‌టిఆర్, అక్కినేని నాగార్జున, అల్లు అర్జున్, రామ్‌చరణ్, మహేష్‌బాబు, నాని, కిరణ్ అబ్బవరం, తేజా సజ్జా, సత్యదేవ్, అడివి శేష్, నటిలు ఖుష్బూ సుందర్, జయప్రద, సుహాసిని, రాధిక శరత్‌కుమార్ ట్విట్టర్ ద్వారా అభినందలు తెలిపారు. ఇంకా అభినందనలు తెలిపిన వారిలో పలువురు హీరోలు, హీరోయిన్లు, నిర్మాతలు, దర్శకులు కూడా ఉన్నారు.

## 'మిస్టర్ బచ్చన్' రవితేజ




రవితేజ నటిస్తున్న 'మిస్టర్ బచ్చన్' చిత్రం నుండి ఆయన పుట్టినరోజు సందర్భంగా ఓ ఫొటో విడుదల చేశారు. హరీష్ శంకర్ దర్శకత్వంలో రాబోతున్న ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, బాలీవుడ్ నిర్మాణ సంస్థ టి సిరీస్ కలయికలో నిర్మాణం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూట్ శరవేగంగా పూర్తి చేస్తున్నారు.

## 'రాబిన్‌హుడ్'గా నితిన్




వెంకీ కుడుముల దర్శకత్వంలో నితిన్ నటిస్తున్న కొత్త చిత్రం టైటిల్‌ని తాజాగా ప్రకటించారు. గ్లింప్స్ కూడా విడుదల చేశారు. 'రాబిన్‌హుడ్' టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రం దోపిడీ నేపథ్యంలో తెరకెక్కుతోందని గ్లింప్స్ చూస్తే అర్థమౌతోంది. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందిస్తున్నారు. మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై రూపొందిస్తున్న ఈ సినిమాని నవీన్ యేర్నేని, రవిశంకర్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

## మార్చి 29న టిల్లు స్క్వేర్ విడుదల




సిద్ధు జొన్నలగడ్డ నటించిన తాజా చిత్రం డిజె టిల్లు మార్చి 29న విడుదల కానుంది. డిజె టిల్లుకు సీక్వెల్‌గా ఈ సినిమా తీస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమాని మొదట ఫిబ్రవరి 9న విడుదల అవుతుందని చిత్ర నిర్మాతలు ప్రకటించారు. అదేరోజు మరికొన్ని సినిమాలు విడుదల కానుండటంతో మార్చి 29కి విడుదల చేయాలని నిర్ణయించారు. అనుపమ పరమేశ్వరన్ కథానాయిక. మల్లిక్‌రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకరా స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై సూర్యదేవర వంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

# భారీ ఆధిక్యత దిశగా..

- భారత్ 421/7
- జడేజా, రాహుల్ అర్ధసెంచరీలు
- ఇంగ్లండ్‌తో తొలి టెస్టు



కెఎల్ రాహుల్ (86 పరుగులు)
జడేజా (81బ్యాటింగ్)

**హైదరాబాద్:** ఉప్పల్ స్టేడియంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత జట్టు భారీ ఆధిక్యం దిశగా దూసుకెళ్తోంది. కెఎల్ రాహుల్, రవీంద్ర జడేజా అర్ధసెంచరీలతో కదం తొక్కడంతో రెండోరోజు ఆట ముగిసే సమయానికి భారతజట్టు 7వికెట్ల నష్టానికి 421పరుగులు చేసింది. దీంతో భారతజట్టు ఇంగ్లండ్‌పై ఇప్పటికే 175పరుగుల ఆధిక్యంలో నిలిచింది. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 119తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన టీమిండియా తొలి సెషన్‌లోనే ఓపెనర్ యశస్వీ జైస్వాల్(80), శుభ్‌మన్ గిల్(23) వికెట్లు కోల్పోయింది. ఆ తర్వాత కేఎల్ రాహుల్(86) మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్(35)తో కలిసి ఇన్నింగ్స్ నిర్మించాడు. వీళ్లిద్దరూ ఆచితూచి ఆడి జట్టు స్కోర్ 200 దాటించారు. అయితే.. రెహాన్ అహ్మద్ బౌలింగ్ అయ్యర్ ఔట్ అయిన కాసేపటికే హర్ట్లే ఓవర్లో రాహుల్ వెనుదిరిగాడు. వికెట్ కీపర్ శ్రీకర్ భరత్, జడేజా క్రీజ్‌లో నిలదొక్కుకోవడంతో భారత్ ఆధిక్యం 150 పరుగులు దాటింది. ఈ క్రమంలో కేఎల్ రాహుల్(86), రవీంద్ర జడేజా(81నాటౌట్) అర్ధసెంచరీలు పూర్తి చేసుకున్నారు. ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్(35 నాటౌట్)తో కలిసిన జడేజా ఇంగ్లండ్ బౌలర్లకు పరీక్ష పెట్టాడు. చివరి 5 ఓవర్లలో గేర్ మార్చిన అక్షర్ ధనాధన్ ఆడడంతో భారత్ స్కోర్ 400 దాటింది. వీళ్లిద్దరూ ఎనిమిదో వికెట్‌కు ఇప్పటికే 63 పరుగులు జోడించారు. ఇంగ్లండ్ బౌలర్లలో టామ్ హర్ట్లే, జో రూట్ రెండేసి వికెట్లు తీశారు.

**స్కోర్‌బోర్డు...**

**ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ : 246ఆలౌట్**

**ఇండియా తొలి ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి అండ్ బి)రూట్ 80, రోహిత్ (సి)స్టోక్స్ (బి)లీచ్ 24, శుభ్‌మన్ (సి)డకెట్ (బి)హార్ట్లీ 23, కెఎల్ రాహుల్ (సి)రెహాన్ అహ్మద్ (బి)హార్ట్లీ 86, శ్రేయస్ (సి)హార్ట్లీ (బి)రెహాన్ అహ్మద్ 35, జడేజా (బ్యాటింగ్) 81, శ్రీకర్ భరత్ (ఎల్‌బి)రూట్ 41, అశ్విన్ (రనౌట్) హార్ట్లీ/ఫోక్స్ 1, అక్షర్ పటేల్ (బ్యాటింగ్) 35, అదనం 15. (110ఓవర్లలో 7వికెట్ల నష్టానికి) 421పరుగులు. **వికెట్ల పతనం:** 1/80, 2/123, 3/159, 4/223, 5/288, 6/356, 7/258 **బౌలింగ్:** వుడ్ 13-0-43-0, హార్ట్లీ 25-0-131-2, లీచ్ 25-6-54-1, రెహాన్ అహ్మద్ 23-3-105-1, రూట్ 24-2-77-2.

## జకోవిచ్ 2,195 రోజుల తర్వాత...

- ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో ఓటమి
- ఫైనల్లో సిన్నర్, మెద్వెదెవ్ ● నేడు మహిళల సింగిల్స్ టైటిల్ పోరు



జకోవిచ్



మెద్వదెవ్
సిన్నర్

**మెల్‌బోర్న్:** ఆస్ట్రేలియా ఓపెన్‌లో పెద్ద సంచలనం నమోదైంది. రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లే లక్ష్యంగా దూసుకెళ్తోన్న ప్రపంచ నంబర్ వన్ ఆటగాడు, సెర్బియాకు చెందిన నొవాక్ జకోవిచ్‌కు ఊహించని షాక్ తగిలింది. శుక్రవారం జరిగిన తొలి సెమీఫైనల్లో ఇటలీ కెరటం జెన్నిక్ సిన్నర్ చేతిలో డిఫెండింగ్ చాంపియన్ అనూహ్యంగా ఓటమి పాలయ్యాడు. దీంతో 2018 (2,195రోజులు) తర్వాత ఇదే టోర్నీలో జకోవిచ్ ఓటమి చవిచూశాడు. మెల్‌బోర్న్ పార్క్‌లో శుక్రవారం జరిగిన తొలి సెమీస్‌లో సిన్నర్ 6-1, 6-2, 6-7(6-8), 6-3తో జకోవిచ్‌ను ఓడించాడు. 2019నుంచి వరుసగా టైటిళ్లు నెగ్గుతున్న జకో.. 2022లో వీసా సమస్యతో టోర్నీకి దూరంగా ఉన్నాడు. ఈ టైటిల్‌ను ఇప్పటివరకు 10సార్లు నెగ్గిన జకో.. సెమీస్‌లో వెనుదిరగడం ఇదే తొలిసారి. సెమీస్‌లో జకోవిచ్ 54 అనవసర తప్పిదాలూ ఓటమి ప్రధాన కారణం. ఇక 6వ సీడ్ జ్వెరేవ్(జర్మనీ), 2వ సీడ్ మెద్వదెవ్(రష్యా)ల మధ్య జరిగిన రెండో సెమీస్ కూడా సంచలనాలతోనే ముగిసింది. తొలి రెండు సెట్‌లో కోల్పోయిన మెద్వదెవ్.. ఆ తర్వాత మూడు సెట్‌లు చేజిక్కించుకొని ఫైనల్‌కు చేరాడు. ఐదుసెట్ల హోరాహోరీ పోరులో మెద్వదెవ్ 5-7, 3-6, 7-6(7-4), 7-6(7-5), 6-3తో జ్వెరేవ్‌ను ఓడించాడు.

**నేడు మహిళల సింగిల్స్ ఫైనల్...**



ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్ శనివారం జరగనుంది. డిఫెండింగ్ ఛాంపియన్, బిడ్డ తల్లి అయిన అర్యానా సబలెంకతో చైనా సంచలనం జియాంగ్ జెంగ్ టైటిల్‌కు తలపడనుంది. ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫైనల్లో వీరిద్దరూ తలపడడం ఇదే ప్రథమం. ముఖాముఖిగా ఒకసారి తలపడగా ఆ మ్యాచ్‌లో సబలెంక విజేతగా నిలిచింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో సబలెంక 2వ స్థానంలో ఉండగా.. జెంగ్ 15వ ర్యాంకర్.

## విహారి, బుయ్ సెంచరీలు

### ఆంధ్ర 274/4

**రాయ్‌పూర్:** రంజీట్రోఫీ నాల్గో లీగ్ మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు పట్టు బిగిస్తోంది. ఛత్తీస్‌గడ్‌తో శుక్రవారం నుంచి ప్రారంభమైన ఎలైట్ గ్రూప్-బిలో ఆంధ్రప్రదేశ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 274పరుగులు చేసింది. కెప్టెన్ రికీ బుయ్(120), హనుమ విహారి(119నాటౌట్) సెంచరీలతో రాణించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రను ఓపెనర్ ప్రశాంత్ కుమార్ (24) రాణించినా.. గిరినాథ్(4), అశ్విన్ హెబ్బర్(3) నిరాశపరిచారు. దీంతో ఆంధ్రజట్టు 41పరుగులకే 3వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో విహారి-బుయ్ కలిసి 4వ వికెట్‌కు 232పరుగులు భారీ భాగస్వామ్యం నెలకొల్పి ఆదుకున్నారు. తొలిరోజు ఆట ముగియడానికి ముందు కెప్టెన్ బుయ్‌ను ఛత్తీస్‌గడ్ బౌలర్ రవికిరణ్ ఔట్ చేశాడు. క్రీజ్‌లో విహారికి తోడు కిరన్ షిండే(3) ఉన్నారు. ఛత్తీస్‌గడ్ బౌలర్లు రవికిరణ్‌కు రెండు, సౌరభ్, వాసుదేవ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

**హైదరాబాద్ 529/1**

ప్లేట్ గ్రూప్‌లో హైదరాబాద్ జట్టు ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడింది. అరుణాచల్ ప్రదేశ్‌ను తొలి ఇన్నింగ్స్‌లో 172పరుగులకే పరిమితం చేసిన హైదరాబాద్.. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించి 48ఓవర్లలో వికెట్ నష్టానికి 529పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ అగర్వాల్(323నాటౌట్; 160బంతుల్లో 33ఫోర్లు, 21సిక్సర్లు)కి తోడు కెప్టెన్ రాహుల్ సింగ్(185) తొలి వికెట్‌కు 449పరుగులు జతచేశారు. వీరిద్దరూ 40.2 ఓవర్లలోనే ఈ పరుగులు సాధించడం మరో విశేషం.

# టెకీలపై ఆగని వేటు

- తాజాగా మైక్రోసాఫ్ట్‌లో 1900 మంది
- సేల్స్‌ఫోర్స్‌లో 700 ఉద్యోగుల తొలగింపు

**న్యూఢిల్లీ :** గతేడాదిలోని లక్షలాది టెకీల ఉద్వాసనలు మర్చిపోకముందే.. కొత్త ఏడాదిలోనూ టెక్నాలజీ కంపెనీలు ఉద్యోగుల తొలగింపునకు వరుస కడుతున్నాయి. ఇప్పటికే గూగుల్, మెటా, అమెజాన్ సహా పలు టెక్ కంపెనీలు సిబ్బందిని ఇంటికి పంపించడానికి ప్రకటనలు చేయగా.. తాజాగా మైక్రోసాఫ్ట్ వేలాది మందిపై వేటు వేయడానికి సిద్ధం అయ్యింది. అదే విధంగా సేల్స్‌ఫోర్స్ కూడా వందలాది మందిని రోడ్డున పడేసే పనిలో పడింది. ఆర్థిక మందగమనం, వ్యయ నియంత్రణ చర్యలు, పునర్ వ్యవస్థీకరణ ప్రణాళిక పేరుతో టెక్ కంపెనీలు సిబ్బందిని తొలగిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే మైక్రోసాఫ్ట్ గేమింగ్ డివిజన్‌లో 1900 మంది ఉద్యోగులపై వేటు వేయనున్నట్లు ప్రకటించింది. యాక్టివిజన్ బ్లిజర్డ్, ఎక్స్‌బాక్స్ సహా గేమింగ్ డివిజన్‌లో తొలగింపులు ఉంటాయని వెల్లడించింది. నూతన ప్రాజెక్టులపై దృష్టి సారించడం, కార్యకలాపాల క్రమబద్ధీకరణతో ఈ సంక్లిష్ట బాధాకర నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని మైక్రోసాఫ్ట్ పేర్కొంది. ఈ ప్రక్రియను గేమింగ్ నాయకత్వ బృందంతో పాటు తాను సాఫీగా సాగేలా కృషి చేస్తామని మైక్రోసాఫ్ట్ గేమింగ్ సిఇఒ ఫిల్ స్పెన్సర్ ఉద్యోగులకు పంపిన మెయిల్‌లో స్పష్టం చేశారు.

**సేల్స్‌ఫోర్స్‌లో 700 మందిపై వేటు..**

క్లౌడ్ ఆధారిత సాఫ్ట్‌వేర్ కంపెనీ సేల్స్‌ఫోర్స్ 700 మంది ఉద్యోగులకు ఉద్వాసన పలికింది. ఆ సంస్థ గత ఏడాదిలోనూ పది శాతం సిబ్బందిపై వేటు వేయడంతో దాదాపు 8000 మంది రోడ్డున పడ్డారు. టెక్ పరిశ్రమ పలు సవాళ్లను ఎదుర్కొంటున్న క్రమంలో ఇతర టెక్ కంపెనీల తరహాలోనే దీర్ఘకాలం నిలదొక్కుకునే వ్యూహంతో సేల్స్‌ఫోర్స్ సైతం సిబ్బంది సంఖ్యకు కోత పెట్టింది. మరోవైపు జర్మనీకి చెందిన సాఫ్ట్‌వేర్ దిగ్గజం శాప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎఐపై దృష్టి పెంచడంతో 8000 ఉద్యోగుల భవితవ్యంపై ఆందోళన నెలకొంది. శాప్‌లో ప్రపంచవ్యాప్తంగా 1,08,000 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా.. ఎఐపై దృష్టి పెట్టడంతో దాదాపు 7 శాతం మంది ఉద్యోగులపై ప్రభావం పడనుందని సమాచారం. అలాగే ఆన్‌లైన్ రిటైలర్ ఈబే దాదాపు 1,000 మంది ఉద్యోగుల తొలగింపులను కూడా ప్రకటించింది. లేఆఫ్స్.ఎఫ్‌వైఐ రిపోర్టుల ప్రకారం.. 2024లో ఇప్పటి వరకు 85 టెక్నాలజీ కంపెనీలు 23,770 మంది ఉద్యోగులను తొలగించాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68